
# మిసిమి

మాస పత్రిక

మార్చి 1991 రు. 2/-



ci

# మిసిమి

*"All that we are is the product of what we have thought," is "We are what we think."* – **Dammapada.**

సంపుటి 2 | మార్చి 1991 | సంచిక 20


REH105M291

విషయసూచిక


మేధావుల మెతకలు-3

బెర్ట్రాండ్ రసెల్ –అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి

గురజాడే బెంగపడిన

మధురవాణి –పురాణం సుబ్రమణ్యశర్మ

హేతువాదం–మానవవాదం –రావిపూడి వెంకటాద్రి

శ్రవ్యశిల్పి బాలమురళి –డా. సంజీవ దేవ్

ఖద్దరు సంస్కృతి –వి.ఆర్. నార్ల

మూఢ నమ్మకాలు ఆవు-ఆయుర్వేదం –యన్. ఇన్నయ్య



వెల 2/రూ. ...................... వార్షిక చందా 30/-రూ.

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Iftekar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyderabad-500 020.

**Editorial Office:**

B-15, Journalist Colony, Jubilee Hills, Hyderabad-500 034.

# FORM IV

(See Rule 8)

STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER

| | |
|---|---|
| NAME OF THE PUBLICATION : | :'MISIMI'. |
| 1. Place of Publication | : Hyderabad, Andhra Pradesh. |
| 2. Periodicity of Publication | : Monthly, Telugu. |
| 3. Printer's Name<br>(Whether Citizen of India? If foreigner state the country of origin & Address). | : RAVINDRANATH ALAPATI<br>: Indian.<br>M/s. Kala Jyothi Process Pvt. Ltd.<br>1-1-60/5, R.T.C. Cross Roads,<br>Hyderabad-500 020. |
| 4. Publisher's Name<br>(Whether Citizen of India? If foreigner state the country of origin Address). | : RAVINDRANATH ALAPATI<br>: Indian<br>M/s. Kala Jyothi Process Pvt. Ltd.<br>1-1-60/5, R.T.C. Cross Roads,<br>Hyderabad-500 020. |
| 5. Editor's Name<br>(Whether Citizen of India? If foreigner state the country of origin Address). | : RAVINDRANATH ALAPATI<br>: Indian<br>M/s. Kala Jyothi Process Pvt. Ltd.<br>1-1-60/5, R.T.C. Cross Roads,<br>Hyderabad-500 020. |
| 6. Names and Addresses of individuals who own the Newspapers and partners or shareholders holding more than one percent of the total capital. | : M/s. Kala Jyothi Process Pvt. Ltd.<br>1-1-60/5, R.T.C. Cross Roads,<br>Hyderabad-500 020. |

I, A. Ravindranath hereby declare that the particulars given above are true and correct to the best of my knowledge and belief.

Date: 2-3-1991

**A. RAVINDRANATH**
PUBLISHER

మేధావుల మెతకలు – 3

# బెర్ట్రాండ్ రసెల్

– స్వేచ్ఛా సేకరణ:

– అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి

మరో అవకాశం ఇస్తే, ఇదే జీవితాన్ని తిరిగి గడపడానికి నీవు ఇష్టపడతావా, అని ప్రశ్నిస్తే నీ సమాధానం ఏమిటి? ఇంత కంటె మంచి జీవితం కావాలని అడుగుతావు. మరి రసెల్ ''నన్ను ముంచెత్తి మునకలు వేయించిన మూడు మహా బలోపేతమైన మోహాలు నా జీవితాన్ని తీర్చిదిద్దాయి. జీవనలాలస, జ్ఞానాన్వేషణ, మానవాళి వ్యథకు నాలో రేగిన భరింప శక్యం గాని కరుణ-ఈ మూడు మోహాలు, పెనుగాలులా, నన్ను అటుఇటు ఊపి, విచలిత పథంలో, వ్యథాభరిత మహాసాగరంలో నిరాశా నిస్పృహల అంచుకు తీసుకుపోయాయి. ఇదీ నా జీవితం. ఇటువంటి జీవితం నాకు విలువైందిగానే కనిపించింది. మరో అవకాశం ఇస్తే ఇలాంటి జీవితం గడపడానికి బహు సంతోషంగా అంగీకరిస్తాను''

27 మే 1919న లిటన్ స్ట్రాచీ, వర్జీనియా ఉల్ఫ్‌కు రాసిన లేఖలో రసెల్గురించి ఇలా అంటాడు: ''రసెల్ బుద్ధి కుశలత వలయాకార రంపం''. ఈ పోలిక చాలా అర్థవంతమైంది. గుండ్రని రంపపు పళ్ళు ఎదురెదురు దిశల్లోనే కాక దశ దిశలా తిరుగుతాయి. అంతే కాదు ఆ రంపం అలా తిరుగుతూనే ఛేదించుకొంటూ ముందుకు చొచ్చుకు పోతుంది. తన సిద్ధాంతాలలోని లోపాలను తానే విమర్శించుకొంటాడు. అతడు తనపై చేసుకొన్న ఆ విమర్శలను చూడకుండానే, అదే విమర్శలను ఇతరులు అతనిపై చేశారు. అలా విమర్శించి ఆ విమర్శలు తమ సొంతం అని భ్రమిస్తారు. అతడి బుద్ధివిశేషం అలాంటిది.''

తనదంటూ ఒక ప్రత్యేక దర్శనం లేని దార్శనికుడాతడు. దర్శనం లేకుండా అతడు దార్శనికుడు ఎలా అయ్యాడు? ఇదే విషయాన్ని మరోలా చెబితే, అతడు సర్వదర్శన దార్శనికుడు. ఎలాగంటే, ఈనాడు చెప్పుకోదగిన తాత్విక దృక్పథం ఏదైనా ఉందీ అంటే, అది అతడి రచనలో ఎక్కడో అక్కడ నిశిత పరిశీలనకు గురైనదే. అన్ని దర్శనాలను పరిశీలించి వాటి మీద అంతో ఇంతో వెలుగును ప్రసరించాడు. అతడొక దర్శనాన్ని పరిశీలించాడంటే దానిని పుటం పెట్టినట్లే.

A.N. వైట్‌హెడ్ ఒకసారి ఆయన్ను గురించి, ''అతడికతడే ఒక ప్లేటో సంవాదం'' అన్నాడు. రసెల్ ఒకరు కాదు, ఇద్దరూ అంటారు విల్ డ్యూరాంట్. ప్రపంచ సంగ్రామంలో చచ్చిపోయిన గణిత శాస్త్రజ్ఞుడు రసెల్ ఒకరు. ఆ గణిత తార్కిక భస్మం నుంచి తిరిగి ఊపిరి పోసుకొన్న మార్మిక కమ్యూనిస్ట్ రసెల్ మరొకరు. మొత్తం మీద అతడు

గణితాన్ని దేవుని స్థాయికి పెంచాడు. ఆ రోజుల్లో అంటే 1914లో అతణ్ణి చూస్తే ఏమనిపించేదంటే, తాత్కాలికంగా మూర్తీభవించిన అమూర్తీకరణం అని, రెండు కాళ్ళపై నిలబడ్డ ఒక గణిత సూత్రమని.

స్పెన్సర్ పంథాలో అతడు, పాఠ్య ప్రణాళికలో శాస్త్రీయ విజ్ఞానానికి పెద్ద పీట వేయాలనే వాడు. ప్రపంచంలో ఎదురయ్యే చిక్కులన్నిటికి కారణం మార్మికతే. ఆలోచన క్రమబద్ధంగా శాస్త్రీయంగా లేని కారణాన ఏర్పడిన గందరగోళం. అందుకని ప్రతిఒక్కరూ తిన్నగా ఆలోచించడం నేర్చుకోవాలి. ''నేను గాని మరొకరు కాని ఒక అబద్ధాన్ని నమ్మవలసి రావడం కంటే, ఈ ప్రపంచం వినాశనమైనా పరవాలేదు. శాస్త్రీయ సత్యాన్ని బోధించాలి.

అతడికి క్రైస్తవం గణితంలా తోచలేదు. మతంలో నీతిని తప్ప తక్కిమ్మాదానినంతా గర్హించాడు. ''ఒక ప్రక్క క్రైస్తవాన్ని కాదన్న వారిని వేధించే నాగరకత, మరో ప్రక్క దానిని కౌగిలించుకొనే వారిని జైలులో పెట్టే నాగరకత – ఈ నాగరకతలు ఎటువంటివి? అటువంటి వైరుధ్యాల ప్రపంచంలో దేవుడు ఎలా ఉంటాడు?'' అని అతడు ప్రశ్నించాడు. అతని జీవితంలో అతడు స్పృశించని-ఊరకే తడవమడం కాదు-సునిశితంగా పరిశీలించని, తనదైన ముద్రను దానిమీద వేయని విషయంగాని జీవితరంగం గాని లేదంటే అతిశయోక్తి లేదు. ఒక అసంపూర్తి లిస్టు ప్రకారం అతడి రచనలు 68. ఆయన రాసిన మొదటి గ్రంథం జర్మన్ సోషల్ డెమోక్రసీ (1896). అతని మరణానంతర ప్రచురణ ''విశ్లేషణలో వ్యాసాలు (essays in Analysis 1973). ఈ మధ్యలో అతడు రాసిన విషయాలు రేఖాగణితం, తత్వం, గణితం, న్యాయం, సామాజిక పునర్నిర్మాణం, రాజకీయ భావాలు, మర్మవాదం, తర్కం, బోల్షివిజం, చైనా, మెదడు, పరిశ్రమ, ఎబిసి ఆఫ్ ఆటమ్స్ (1923), విజ్ఞానశాస్త్రం, సాపేక్షవాదం, విద్య, సంశయవాదం, వివాహం, సుఖం, నీతి, సోమరితనం, మతం, అంతర్జాతీయ వ్యవహారాలు, చరిత్ర, బలం, సత్యం, విజ్ఞానం, అధికారం, పౌరసత్వం, నీతిశాస్త్రం, జీవిత చరిత్ర, నాస్తికవాదం, జ్ఞానం, భవిష్యత్తు, ఆయుధ విసర్జన, శాంతి, యుద్ధనేరాలు, ఇంకా ఎన్నో విషయాలపై అతడు గాఢంగా, లోతుగా తన ముద్రవేశాడు. అంతేకాక వార్తాపత్రికల్లో, మాసపత్రికల్లో, ''పెదాల రంగునుంచి – భార్యలను బాదడం'' వరకు, మనం ఊహించగల అన్ని అంశాలపై రాశాడు, రేడియో ప్రసంగాలు చేశాడు. 1920లో మాలెసన్ అతనిని గురించి ఇలా రాశాడు. ''ప్రతి ఉదయం బెర్టీ ఉదయాన్నే ఒంటరిగా నడకకు వెళతాడు. ఆ సమయంలో తానారోజు ఏమి రాయాల్సిందీ ఆలోచించుకొంటాడు. ఇక ఆ తరువాత ఇంటికి వచ్చి సాఫీగా ఒక్క దిద్దుబాటు గూడా లేకుండా మిగిలిన సమయం అంతా రాస్తాడు''. అతడు అన్ని విషయాలమీద అంత ప్రమాణంలో రచన ఎలా చేయగలిగాడు? కొంతమంది ఆయన రాసిన ప్రతి పదానికి డబ్బులు వచ్చేవి కనుక అలా రాయగలిగాడన్నారు. డబ్బు వచ్చిన మాట నిజమే అయినా, అతడి అన్ని సంపుటాల రచనకు ప్రేరణ అదే కాలేదు. అతడు రాయకుండా ఉండలేక రాశాడని మనం భావించవచ్చు. అది అతని ఆత్మాభివ్యక్తీకరణ.

1872లో లండన్‌లో జన్మించాడు. అనాథగా పెరిగాడు. ఎలాగంటే తల్లి, తండ్రి – ఇద్దరూ అతనికి నాలుగేళ్ళు నిండక ముందే గతించారు. తండ్రి స్వేచ్ఛా చింతనుడు కావడాన, అతడు మరణించే ముందే, రసెల్‌ను జాన్ స్టూవర్ట్ మిల్ దార్శనిక బాణీలో పెంచాలని ఆదేశించి చనిపోయాడు. కాని నాయనమ్మ అదేమీ కుదరదని బైబిళ్ళ మధ్య పెంచింది. ట్యూటర్లను ఇంటికి రప్పించి చదువు చెప్పించారు. అయితే ఈ ప్రభావా లేమీ అతడి మీద పని చేయలేదు. తన దారినే తాను పెరిగాడు. పదిహేనేళ్ళ వయస్సులో, తన మత వ్యతిరేక భావాలు, పెద్ద వాళ్ళకు తెలియరాదనే ఉద్దేశంలో అతడు వాటిని తన డైరీలో గ్రీకు అక్షరాలతో రాశాడు. ''నన్ను ఏ మతస్థునిగా పెంచారో ఆ మతం పునాదులను చూశాను'' – అన్నాడు. ఆ రోజుల్లోనే అతడు అవిశ్వాసిగా మారాడు. జీవితాంతం అలాగే ఉండి పోయాడు. దేవుడు కాకపోయినా, ఈ ప్రపంచం నిలబడడానికి నడవడానికి ఏదో ఒక అతీతమైన శక్తి ఉండాలని అనేకమంది చేసే వాదం అతనికి రుచించలేదు. ఈ ప్రపంచ ప్రహేళికలకు సమాధానం కనుకొంటే ఎప్పటికైనా మానవ మేధ మాత్రమే కనుక్కోవాలి. లేదా అసలు కనుక్కోక పోవడమైన జరగాలి. మరో విధంగా వీటిని పరిష్కరించే వీలు లేదు. మానవ మేధస్సు మీద అతడికి అంతటి ఆచంచల విశ్వాసం. అంతే కాదు. అతనికి అమూర్త ఆలోచన అంటే మహా ఇష్టం. అందుకే ఆయనను గణితం ఆకట్టుకొంది. ''గణితం అంటే నాకు మహా ఇష్టం. ఎందుకంటే అది మానవం కాదు. గణితంలో సత్యమే కాదు. అందం కూడ ఉంది. ఆ అంచం అతిశీతలం, కడు నిష్ఠురం. శిల్ప చందం దాని అందం. మానవ బలహీనతలను రెచ్చగొట్టదా అందం. నిజమైన కళ ప్రదర్శించే పరిపూర్ణతను అది ప్రదర్శిస్తుంది'' అంటాడు రసెల్ ఆ సౌందర్య భావనతోనే అతడు Praincipia mathematica అనే గ్రంథాన్ని వైట్‌హెడ్ తో కలిసి రాశాడు. దీనికే నోబెల్ బహుమానం పొందాడు.

గణితం, తత్వం మామూలు మనుషుల కోసం కాదు. అవి ఆయా శాస్త్రాలలో పారంగతులైన వారికోసం మాత్రమే. మామూలు మనిషికి లోకజ్ఞానం మాత్రమే ఉంటుంది. లోకజ్ఞానంలో ''ఆటవికుల అధిభౌతిక జ్ఞానం'' మాత్రమే ఉంటుంది. మామూలు వాళ్లు జీర్ణించుకోగలిగిన మేరకే మేధావుల ఆలోచనా ఫలితాలను వారికి అందించాలంటాడు రసెల్. అయితే అతడి జీవితం ఉత్తరార్ధంలో, ప్రజలు ఏమి చెయ్యాలో ఏలా ఆలోచించాలో విస్తృతంగా చెప్పాడు. దీనితో ప్రపంచం అంతా, దార్శనికుడు ఎవరూ అంటే, రసెల్ అనే అభిప్రాయానికి వచ్చింది. అతడు దార్శనికుల ఆదర్శ రూపం అయ్యాడు. 'దర్శనం' అంటే ఏమిటి? అంటే రసెల్ చెప్పిందే 'దర్శనం' అన్నారు జనం.

1946లో అతడు ప్రకటించిన ''పాశ్చాత్య తత్త్వ చరిత్ర' (Story of western Philasphy) చాలా అద్భుతమైన గ్రంథం. అటువంటి గ్రంథాలలో దానిదే అగ్రతాంబూలం. ఆయన తోటి వారు ఆ గ్రంథం విజయాన్ని చూచి అసూయతో వేగిపోయారు.

అతడి జీతం మొత్తంలో నాలుగు సార్లు చట్టం తన దీర్ఘ బాహువులను అతడివేపు

సాచింది. మొదటిసారిగా 1916లో యువకులను బలవంతంగా మిలిటరీలో చేర్చాలని నిర్దేశించే చట్టం. ఈ చట్టాన్ని గురించి అతడొక 'ఆకాశ రామన్న' కరపత్రం వేశాడు. దానిని పంచుతున్న వారిని ప్రభుత్వం నిర్బంధించడంతో, తానే దాని రచయితనని బహిర్గతం చేసి జైలు కెళ్ళాడు. దీనితో ట్రినిటీలో అతని ఫెలోషిప్ ఊడింది. ఒక తప్పుకు రెండు శిక్షలు. తరవాత ''జర్మన్ పీస్ ఆఫర్''ను గురించి 1918 ఫిబ్రవరి 11న ట్రిబ్యునల్ అనే రాడికల్ పత్రికలో వ్యాసం రాసినందుకు రెండవసారి జైలు కెళ్ళాడు. ''అమెరికన్ సైన్యం జర్మన్ సైన్యాన్ని ఎదుర్కోగలిగినా ఎదుర్కోలేక పోయినా, సమ్మె జరిపే వారిని భయపెట్ట గలదు. ఇది వారికి ఇంటి వద్ద (అమెరికాలో) అలవాటైన విద్యే'', అని రాశాడు. ఇలాంటి రాత ఇంగ్లాండ్ అమెరికా సంబంధాలను బెడిసిపోయేట్లు చేస్తుంది. ఆ కారణాన జైలులో వేశారు. తరువాత 1939–40లో న్యూయార్క్ సిటీ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా నియమింపబడినప్పుడు అతని మత వ్యతిరేకతను, అనైతిక దృక్పథాలకు అమెరికా నుంచి పంపివేశారు. క్రైస్తవ వ్యతిరేక వ్యాసాలు ఎన్నో రాశాడు. నాస్తిక విశ్వాసాన్ని, మతాధికారులు ముక్కుతో మాట్లాడే పద్ధతితో, వారిని వ్యంగ్యానుకరణం చేస్తూ చెప్పేవాడు. ''మాకు దేవుని మీద నమ్మకం లేదు. కాని మానవాళి అధికృత మీద విశ్వాసం ఉంది. మరణానంతర జీవితాన్ని విశ్వసించం. కాని సత్కర్మల ద్వారా లభించే శాశ్వతత్వాన్ని నమ్ముతాము'' – ఈ వాక్యాలను పిల్లలకు చెప్పడంలో అతడు మహదానందం పొందేవాడు. న్యూయార్క్ సిటీ విశ్వవిద్యాలయం పదవికి ఎంపిక చేసినప్పుడు 'ఇతడు మతవ్యతిరేకి కనుక పనికి రాడని' ఒకామె కోర్టుకు వెళ్లింది. ఆమె న్యాయవాది రసెల్ రచనలను కామోద్దీపకాలనీ, వైషయికాలనీ, శృంగార భూయిష్టాలనీ, పచ్చి రతిపూరితాలనీ, కామోన్మాదాలని, కామవాంఛా జనకాలనీ, అసత్యాలనీ, అసభ్యాలనీ, అనైతికాలనీ వర్ణిస్తే, ఆ కోర్టు న్యాయమూర్తి అతనిని, ''వైదేశిక నాస్తికుడని, స్వేచ్ఛా ప్రణయ వాది,'' అనీ అభిశంసించి అమెరికానుంచి పంపివేశాడు. ఇక ఆఖరు సారిగా 1961లో – అతడి ఎనభయ్యో ఏట – న్యూక్లియర్ బాంబులకు వ్యతిరేకంగా, రక్షణ శాఖ కార్యాలయం ఎదుట బైఠాయింపు సమ్మె చేసి, అనేక ఘంటలు అక్కడ కూర్చొని అరెస్టు కావాలని ప్రయత్నించాడు. కాని ఏమీ జరగలేదు. గృహోన్ముఖుడు కాక తప్పలేదు. కాని ప్రజలను రెచ్చగొట్టినందుకు 12 సెప్టెంబరున, కోర్టుకు హాజరుకమ్మని, సమన్లు వచ్చాయి. ఒక నెల జైలు వేసి, దానిని వారానికి తగ్గించి, జైలు ఆసుపత్రిలో ఉంచారు. శిక్షను ప్రకటిస్తూ న్యాయమూర్తి ''ఇంతకంటె మంచి విషయాలు తెలియవలసినంత వృద్ధుడవయ్యావు'', అని మాత్రం అన్నాడు.

సోక్రటీజ్ లా తత్త్వాన్ని నడి బజారులో తేగలిగాడా లేదా అన్నది అనుమానాస్పదమే అయినా అతడి ప్రయత్నాలలోని నిజాయితీని ఎవరూ శంకించరు. ప్రపంచంలోకి తత్వాన్ని తీసుకెళ్ళడంకంటె, ప్రపంచాన్ని తత్వానుసారం మార్చాలని ప్రయత్నించి విఫలమయ్యాడని కొందరు విమర్శిస్తారు. అమూర్తంగా ఎంతటి విషయాన్నైనా ఆలోచించ గలడు గాని, ఆచరణలో చిన్న చిన్న పనులు గూడ చేసుకోలేడు. కనీసం

టీ పెట్టుకోవడం లాంటి చిన్న పనులు చేయడం అతడి బుర్రకుమించిన పని. అతడికి టీ అంటే ఎంతో ఇష్టం. ఒకసారి మూడవ భార్య టీ పెట్టుకోవడం ఎలాగో వంట ఇంటి పలక మీద రాసి పెట్టి వెళ్ళిపోయింది. ''కెటిల్ పొయ్యి మీద ఉంచు. మరుగనివ్వు. తరవాత టీ పాట్‌లోకి వంచాలి.'' ఈ పనులు చేయడం ఆయన వల్ల కాలేదు. ముసలితనంలో చెవుడు వస్తే, 'చెవిటి మిషన్ను' చెవిలో పెట్టుకోవడం ఆయనవల్ల కాలేదు. ఎవరైనా చేసి పెట్టవలసిందే.

అతడికి భౌతిక ప్రపంచం, మానవ ప్రపంచం-ఈ రెండూ ఎప్పుడూ అర్థం కాలేదనిపిస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం ''నా ఉద్దేశాలు మార్చుకొన్నా'', నన్నాడు. ''అప్పటిదాకా తలిదండ్రులకు పిల్లల్ని ప్రేమించడం సహజ మనుకొన్నాను. కాని యుద్ధాన్ని చూసిన తరవాత ఆ పని బహు అరుదు అని తెలుసుకొన్నాను. అలాగే యుద్ధానికి ముందు అందరికీ డబ్బంటే ఇష్టం అనుకొన్నాను. కాని యుద్ధం తరవాత మనుషులకు 'వినాశం' అంటే ఇష్టం అని గ్రహించాను. మేధావులు సత్యాన్ని ప్రేమిస్తారనుకొన్నాను. కాని 10 శాతం కూడ 'పేరు' కంటె 'సత్యా'నికి విలువ నివ్వరని తెలుసుకొన్నాను.''

సిద్ధాంత జ్ఞానం, ఆచరణాత్మక అజ్ఞానం – ఈ రెండింటి సంయోగం ఇతరులలో ఉన్నప్పుడు (ఈ సంయోగమే తనలోనూ ఉంది) అతడు దానిని స్పష్టంగా చూడగలడు. 1920 మే 19న బోల్షివిస్ట్ రష్యాలో లెనిన్‌ను కలుసుకొన్నాడు. లెనిన్‌ని 'రూపుకట్టిన సిద్ధాంతం'గా రసెల్ దర్శించాడు. ''అతడు మనుషులను గర్హించే భౌద్ధిక కులీనుడని'' అనిపించిందన్నాడు. లెనిన్ గురించి ముందుగా ఏమీ తెలియకుండా అతడిని కలిస్తే, అతడు ''ఏవో కొన్ని అభిప్రాయాలున్న ఆచార్యుడు''గా కనిపిస్తాడే కాని, ఒక నాయకుడని మాత్రం అతనిని ఎవరూ అనుకోరు. ఇందులో గమ్మత్తు ఏమిటంటే అతడికి లెనిన్ ఎలా కనిపిస్తాడని రాశాడో, రసెల్ కూడా వాస్తవంలో ఇతరులకు అలాగే కనిపిస్తాడనే విషయం గుర్తించలేకపోయాడు.

మామూలు మనిషి వికార, మోహాల పుట్ట అని, ఊరికే ఉద్వేగాలకు గురవుతారనీ రసెల్ భావన. వీటి నుంచి మనిషిని మరల్చాలంటే తర్కాన్ని ఆశ్రయించాలంటాడు. మానవుడు మరీ తాత్వికంగా పోయి, అతికి పోకపోతే, మానవ సంబంధాలు మెరుగు పడతాయి. యుద్ధాలు రావు. గణితశాస్త్రవేత్తగా రసెల్ చెప్పేదేమంటే, ప్రతి గణిత సమస్యను తార్కికంగా పరిష్కరించినట్లే, వివేచన ద్వారా పరిష్కారం కాని మానవ సమస్య ఉండదు. అంటే ప్రతి సమస్య గణిత సమీకరణాలలా ఉంటుందని రసెల్ ఉద్దేశం కాదు. సహనంతో కొంత సమయం తీసుకొని ఆలోచిస్తే మానవ సమస్యలు చాలావరకు పరిష్కార సాధ్యాలని అతడి భావన.

కాని ఈ వాదననే రసెల్ వ్యక్తిగత జీవితాలకి అన్వయిస్తే, పై సిద్ధాంతాలు రుజువుకావు. అతడి జీవితంలో ఎదురైన ప్రతి ముఖ్యమైన సమస్యా పరిష్కారంలో- ముఖ్యంగా అతని ''అర్థం'' దెబ్బతింటున్నప్పుడు- తర్కం కాక ఉద్వేగాలు వికారాలే అతడిని పాలించాయి.

రసెల్ జీవితంలో 'యుద్ధం – శాంతి' అనే అంశం మిగతా అన్ని విషయాలకంటె

గూడ అధిక ప్రాముఖ్యాన్ని సంతరించు కొంది. బహుశా అతడు దీనిమీదే తన శక్తియుక్తులన్నీ కేంద్రీకరించాడు. రసెల్ ఉద్దేశంలో మానవుని అహేతుక ప్రవృత్తికి యుద్ధం ప్రతీక. రెండు ప్రపంచ మహా సంగ్రామాలను చూశాడు. వాటి వినాశకర ఫలితాలనూ చూశాడు. యుద్ధాన్ని ఎవరు ఏ విధంగానూ సమర్థించలేరు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం అతడొక అభిప్రాయానికి వచ్చాడు. బలవంతగానైనా సరే శాంతిని మానవాళి మీద రుద్దాలిసిందే. అగ్ర రాజ్యమైన అమెరికా ప్రపంచంలో ఆయుధ విసర్జనకు తన బలాన్ని వినియోగించాల న్నాడు. అమెరికా అణ్వాయుధాల మీద గుత్తాధిపత్యం సంపాదించిన 1945–49 సంవత్సరాలలో ఇదే ప్రతిపాదనను పదే పదే చేశాడు. రష్యామీద ''నివారణ యుద్ధం'' (Presentive war) చేయాలని పలుమార్లు ప్రతిపాదించాడు. మార్క్సిజమ్‌ని పూర్తిగా పరిహరించాడు. స్టాలిన్ భీకర రాకాసి. అమెరికా, జపాన్ మీద మొదటి సారిగా అణు బాంబును వేసినప్పుడు, అతడు మళ్ళీ మళ్ళీ చెప్పాడు: ప్రపంచం మీద అమెరికా ఆయుధ విసర్జన విధించాలి. కావల్ కేడ్ (Cavalcade) లో అతడు ఇదే విషయాన్ని రాసి దాని శీర్షిక 'మానవాళి ఆఖరి అవకాశం' అని పెట్టాడు. యుద్ధానికి దారితీసే రాజకీయ సంఘటనను కనుక్కోవడం కష్టం కాదన్నాడు. 1945–50 ప్రాంతాలలో రష్యామీద 'నివారణ యుద్ధం' గురించి ఎంతో చర్చ జరిగింది. 1948లో ఆమ్స్టర్ డామ్‌లో జరిగిన ఫిలాసఫీ కాంగ్రెస్‌లో ఈ ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకొని రష్యా ప్రతినిధి రసెల్ మీద దాడి చేశాడు. దీనికి ప్రతిగా అతడు, ''మీరు తిరిగి మీ దేశం పోయి, మోసం, ప్రచారాలను చాకచక్యంతో నిర్వహించగల సమర్థులైన సేవకు లను పంపమని మీ యజమానులకు చెప్పండి'' అన్నాడు. న్యూయార్క్ టైమ్స్ మాగజీన్‌లో 1953 సెప్టెంబర్ 27న రాశాడు: ''యుద్ధం భయానకమైందే, అయినా నా మట్టుకు నేను, కమ్యూనిస్టు మహాసామ్రాజ్యం కంటె యుద్ధాన్నే కోర తాను.''

సరిగ్గా ఈ సమయంలోనే యుద్ధాన్ని గూర్చిన అతడి అభిప్రాయాలు మార్పుకు లోనయ్యాయి. రష్యామీద 'నివారణ యుద్ధాన్ని' తానెప్పుడూ ప్రతిపాదించ లేదని నేషన్ పత్రికలో 1953 అక్టోబరులో రాశాడు. నాపై వచ్చిన ఈ కథలన్నీ రష్యన్ల కల్పితాలేనన్నాడు. కాని అమెరికాకు చెందిన ఆయుధ విసర్జన నిపుణులు అతని ప్రకటనలన్నింటిని జతపరిచి అతనికి పంపినప్పుడు వాటిని అతడు కాదనలేక పోయాడు.

1958లో అణ్వాయుధ విసర్జన కమిటికి (CND) ప్రసిడెంట్ అయ్యాడు. జె.బి ప్రీస్ట్లీ, జాన్ కాలిన్స్ దీనిలో సభ్యులు. ఇంగ్లాడ్ లో, ప్రపంచంలో ఆయుధాల తయారీకి వ్యతిరేకంగా అభిప్రాయాలను కూడగట్టుకు రావడం దీనిపని. తరవాత దీనిని చీల్చి, సహాయనిరాకరణానికి ఉద్దేశించిన ''వందమంది కమిటి'' (Committee of One Hundred) ని స్థాపించాడు. దీని మీద మొదట సంతకం చేసిన వారిలో

కాంప్టన్ మెకంజీ, జాన్ బ్రెయిన్, జాన్ అన్‌బరన్, ఆర్నాల్డ్ వెస్కర్, రెగ్‌బట్లర్, అగస్టస్ జాన్, హెర్బర్ట్ రీడ్ , డోరిస్ లెసింగ్‌లాంటి మేధావులు, కళాకారులు, రచయితలు ఉన్నారు.

యుద్ధాల మధ్య ఆయన కొన్ని విష యాల మీద ఎక్కువగా మాటాడారు. అవన్నీ ప్రసిద్ధాలయ్యాయి. 'తోడు కోసం పెళ్ళి', 'స్వేచ్ఛా ప్రణయం' 'విడాకుల సంస్కరణ', 'సహవిద్య' మొదలైన విష యాల మీద ఎంతో చెప్పాడు. వివాహానికి వెలుపల, లోపల స్త్రీకి పురుషునితోపాటు సమానహక్కులు ఉండాలన్నాడు. నైతికా ధారం లేని సంప్రదాయ నీతికి స్త్రీలు బలైపోయారు; లైంగిక స్వేచ్ఛ ఉండాల న్నాడు.

అయితే అతడి ప్రవర్తన వాస్తవంలో స్త్రీల యెడ మరోవిధంగా ఉంది. రసెల్ సోదరుడు ఫ్రాంక్ 1900లలో భార్యకు విడాకులిచ్చి రెండో పెళ్ళి చేసుకొన్న ప్పుడు, తనతో భోజనానికి కూచోమంటే, ఆమెను వేరేచోట ఉంచి రావాలన్నాడు. ఆ తరువాత మాత్రం అటువంటి నిషేధాలను పాటించలేదు. సంప్రదాయక లైంగిక నీతిని వదిలివేశాడు. 1911 మార్చి 19న లేడీ ఒటోలిన్ మోరెల్‌ను, ఆమె భర్త ఇంటలేన ప్పుడు కలసి ఆమెకు ప్రేమ విందు చేశాడు. నాటి నుంచే రసెల్ మొదటి భార్య షరి న్‌కు దూరమైనట్లయింది. ఆ రాత్రి ఒటో లిన్‌తో ''నిండు సంబంధాలు'' పెట్టుకోలే దన్నాడు. ఏమైనా, తాను ఆలిస్‌నూ, ఒటోలిన్ ఆమె భర్తను వదిలివేయాలని నిశ్చయించుకొన్నామని రాసుకొన్నాడు. మోరెల్ దీనిని ఎలా స్వీకరిస్తాడనేది తన కనవసరం అన్నాడు. ఆమె భర్త ఒకవేళ తామిద్దరిని చంపినా, ఒకరాత్రి పొందు కోసం ఆ మాత్రం మూల్యం చెల్లించ వెనకా డనన్నాడు. ఈ సంగతి ఆలిస్‌తో చెప్పిన ప్పుడు, ఆమె ఒటోలిన్ పేరును బయ టకు లాగి విడాకులకు పడవేస్తానంది. అప్పుడు రసెల్ అంటాడు. 'ఆలిస్ అంత గట్టి పట్టుబడితే మరణమే శరణ్యం. దానితో ఆమె కోపానికి అంతులేకపో యింది. అలా కోపం ఆమె వెళ్ళక్కాక, ఆమె అన్న కూతురుకు లాక్ తత్వం మీద పాఠం చెప్పాను.'

1913లో ఆల్ప్స్ పర్వతాలలో ఒక మనోవిశ్లేషకుని భార్యను కలిశాడు. ఆమెతో ప్రేమ నడపాలనుకొన్నాడు. కాని అలా చేయబోయే ముందు ఆమెకు ఒటోలి న్‌తో తన సంబంధాలను గురించి చెప్పాల నుకొన్నాడు. కాని ఆమె ఆ వ్యవహారం మీద అంత ఆసక్తి చూపించలేదు. ఒక రాత్రికి పరవాలేదనుకొంది. ఆ తరవాత మరెప్పుడూ ఆమెను కలవలేదు.

1914లో చికాగోలో ఒక చిన్నమ్మా యితో వ్యవహారం నడిపాడు. ఆ అమ్మా యికి ఇంకా ముగ్గురు సోదరీమణులు న్నారు. ''నేను రెండు రాత్రిళ్ళు వాళ్ళిం టిలో గడిపాను. అందులో ఒక రాత్రి ఆ అమ్మాయి దగ్గర పండుకొన్నాను. మిగతా ముగ్గురూ ఆమె తలిదండ్రులలో ఎవరైనా అటుకేసి వస్తారేమోనని కాపలా కాశారు'' ఆమె పేరు హెలీన్ డడ్లే. ఆ అమ్మాయిని వేసవిలో ఇంగ్లాడ్ వచ్చి బహిరంగంగానే తనతో ఉండమని కోరాడు. ఈ విషయం ఒటోలిన్‌తో చెప్పాడు. అతడి నోటి దుర్వాసన పోయిన సంగతి తెలిసి, తనతో వ్యవహారం సాగించమని ఒటోలిన్ కోరింది. 1914లో హెలెన్ డడ్లే లండన్ వచ్చింది. ఈలోపు యుద్ధం ఆరంభం కావ డంతో, రసెల్ యుద్ధాన్ని వ్యతిరేకించ దలిచి, తన ప్రతిష్ఠను కాపాడుకోవడం కోసం, చెదురుమదురుగా ఆమెతో సంబం

ధాలు పెట్టుకొన్నా, మొత్తం మీద ఆమెను దూరంగా ఉంచాడు. ''యుద్ధం నా ప్రేమను చంపింది. నే నామె హృదయాన్ని నలిపి వేశాను''.

తరవాత 1916లో కాన్‌స్టన్స్ మాలెసన్ అనే ఆమెతో గ్రంథం సాగించాడు. ఒటోలిన్‌తో కలిసి ఆమె రసెల్‌ను పంచుకొంది. ద్రౌపది సంవత్సరాలు చేస్తే ఈమె వారాలు చేసింది.

తరవాత డోరా బ్లాక్‌తో ప్రేమలోపడి ఆమెకు కడుపు చేశాడు. ఆమె విముక్త. అందుకని వివాహం తంతులో విశ్వాసం లేదని ఆమె వివాహం వద్దంది. రసెల్ కావాలన్నాడు. అందుకని ఆరు వారాల్లో బిడ్డపుడుతుందనగా పెం ' వేసుకొన్నారు. కాన్‌స్టన్స్‌ను పూర్తిగా వదిలివేశాడు. వివాహాన్ని సిగ్గుమాలిన పనిగా, అవమానకరమైన దానిగా భావించిన డోరా బలవంతంగా పెళ్ళి కూతురైంది. రసెల్‌కు ఇప్పుడు ఏభై ఏళ్ళువచ్చాయి. ఆమె అందచందాలతో మత్తెక్కిన రసెల్ చెప్పులు లేకుండా వెన్నెల రాత్రుళ్ళు తుషార బింధువులతో తడిసిన పచ్చిక మీద ఆమెతో పరుగులు తీశాడు.

శారీరకంగా అతడేమంత అందమైన వాడు కాదు. అతడి నవ్వు వడ్రంగి పిట్ట చెట్టు కొడుతున్నప్పుడు వచ్చే శబ్దంలా ఉంటుందని అతని శిష్యుడు టి.ఎస్. ఇలియట్ చెప్పాడు. జార్జి శాంతాయన దృష్టిలో అది హైనా అరుపులా ఉంటుంది. బియాట్రిస్ వెబ్, తన డైరీలో అతడికి ముసలితనం ముందుగా వచ్చిందనీ, వట్టి సినికల్‌గా తయారయ్యాడనీ వ్రాసుకొంది. మరి అలాంటి వాడి గాలిలో ఎగిరే జుట్టు, కొనతేలిన పెద్ద నాసిక, బుల్ల గడ్డం అంటే మరి డోరాకు ముద్దు. ఎవరికి ఏది ముద్దో చెప్పడం ఎంత కష్టం.

వారికి జాన్, కేట్ అనే ఇద్దరు పిల్లలు కలిగారు. ఇద్దరి మధ్య లైంగికత మీద తగువులారంభమయ్యాయి. టాల్‌స్టాయ్ లాగా రసెల్ గూడ 'బహిరంగతా' సిద్ధాంతాన్ని పాటించాలన్నాడు. ''లైంగిక సాహసాల్లో బెర్టీ, నేనూ ఒకరి స్వేచ్ఛకు మరొకరు అడ్డురాకూడదనుకొన్నాము'', అని డోరా అంది. ఫలితంగా గ్రిఫిన్ బారీ అనే ఒక జర్నలిస్టుతో ఆమె బహిరంగంగా ప్రేమ కలాపం మొదలు పెడితే రసెల్ ఏమీ అనలేదు. పైగా, పద్దెనిమిదవ శతాబ్ది విగ్ మహిళలు వేరు వేరు తండ్రులను బిడ్డలను గన్న ఫక్కీలో ఆమె నడవవచ్చు అన్నాడు. ఆ రకంగా ఆమె ఇద్దరు బిడ్డలకు, ఆ జర్నలిస్టువల్ల, తల్లిఅయింది. స్వేచ్ఛా ప్రణయాన్ని ఎంతగా ప్రతిపాదించినా తన వరకు వచ్చే సరికి అది ఎంతో కష్టం అనిపించింది. సిద్ధాంతం ప్రకారం తార్కికంగా అవునన్నా అంతరంగం కాదంది. అందుకే అతడు ఆమెతో సరిగా ఉండలేకపోయాడు. ఆ తరవాత చాలా కాలానికి తన ఆత్మకథలో ''నా రెండో భార్యకు ఆ గౌరవం ఇవ్వాలని నా సిద్ధాంతం అనివాకొన్నా నేను దానికి సరితూగలేకపోయాను'' అని రాసుకొన్నాడు డోరా. సంతానంతో ఇంటికి రావడంతో రసెల్ తన ప్రేమ పీటర్ స్పెన్స్ పైకి మళ్ళిందన్నాడు. పీటర్ స్పెన్స్ ఆక్స్‌ఫర్డ్ విద్యార్థిని, సెలవుల్లో రసెల్ పిల్లలను సాకడానికి నియమితమైంది. డోరా తోవిడాకులకై కోర్టులో పడేశాడు. 1935లో విడాకులిస్తూ జడ్జి ''ఆమె విశ్వాసఘాతుకురాలు కాక

ముందే ఆమె భర్త రెండుసార్లు విశ్వాసఘాతుకానికి పాల్పడినట్లు రుజువైంది'' అని పేర్కొన్నాడు.

తరవాత రసెల్ ఆ విద్యార్థినిని వివాహమాడాడు. 15 సంవత్సరాలు ఈ మిథున దాంపత్యం కొనసాగింది. ''1949లో నానుంచి నా భార్యకు కావలసింది ఏమీ లేదు-అనే స్థితికి ఆమె రావడంతో, అది మా వివాహానికి భరతవాక్యం పలికింది'' అన్నాడు రసెల్. కాని ఈ మధ్యలో చెదురుమదురుగా ''చిల్లర వ్యవహారాలు'' నడిపాడు. మొత్తానికి ప్రేమ వ్యవహారాల నిపుణుడయ్యాడు. సిడ్నీ హుక్‌కు ప్రేమ వ్యవహారం గురించి అడగకనే ఒక సలహా పారవేశాడు. ''హుక్! ఎప్పుడైనా నీవు ఒక హోటల్‌కు అమ్మాయిని తీసుకువెళ్ళినప్పుడు, రిసెప్షన్ క్లర్క్‌కు అనుమానం రాకుండా ఉండాలంటే, వాడు రూము అద్దె రేట్లను చెప్తున్నప్పుడు 'అమ్మో అంత అద్దే' అని ఆ అమ్మాయిని అనమను చాలు. అతడికి ఇక అనుమానం రాదు.''

అతడు తన శిష్యుడైన T.S. ఇలియట్ భార్య వివెన్ హెల్వర్‌ను గూడ వదలలేదు. వివెన్‌తో తన సంబంధాలు ప్లేటోనిక్ (కామరహితం) అని ఒటోలిన్‌తో చెప్పి, కాన్‌స్టన్స్‌తో కామసహితమే నన్నాడు. ఏది ఏమైనా ఇతడి కారణంగా ఆమె పిచ్చిదైంది. ఆచార్య సిడ్నీహుక్ రసెల్ మీద ఒక పదచిత్రణం రాస్తూ'' వయస్సు ముదిరిన రోజుల్లో గూడ రసెల్ తనకెదురైన లంగాలను (లంగా = Skirts) వదిలిపెట్టలేదు'' అన్నాడు.

80వ యేట పీటర్ స్పెన్స్‌కు విడాకులిచ్చి ఎడిత్‌ను వివాహమాడాడు. ఈమె అతనిక ఎంతోకాలంగా తెలుసు. మిగిలిన అతని జీవితమంతా ఆమె తోడునీడై అతడి అవసరాలను తీర్చింది. తన ఆత్మ కథను ఆమెకు అంకితమిస్తూ. •

సుదీర్ఘమైన ఎన్నో సంవత్సరాలుగా

శాంతిని అన్వేషించాను
పారవశ్యాన్ని కనుగొన్నాను, వ్యథను చూశాను.

ఉన్మాదాన్ని అనుభవించాను
ఏకాంతాన్ని భరించాను
హృదయాన్ని నమిలి మెలిపెట్టే
ఏకాంత బాధను ఎరిగాను
కాని శాంతిని నేనెరుగను

ఇప్పుడో, వృద్ధుడనై, కాటికి చేరువవుతున్న ఈ సమయంలో,

నిన్ను నేను ఎరిగాను,
నిన్ను ఎరగడంతో
పారవశ్యాన్ని, శాంతిని – రెండింటిని కనుగొన్నాను,
విశ్రాంతి తెలిసింది
యిన్ని ఏకాంత సంవత్సరాల అనంతరం జీవితం, ప్రేమ ఏమికావచ్చో తెలుసుకొన్నాను.
ఇప్పుడిక నేను నిదురిస్తే,
కృతార్థుడుగా నిదురిస్తాను. ★

తన ఆత్మకథలో తన తల్లి శీలాన్ని గురించి
తన అనుమానాన్ని వ్రాయటానికి సాహశించాడు.

గురజాడే బెంగపడిన

# మధురవాణి

– పురాణం సుబ్రమణ్యశర్మ

‘‘మధురవాణిని వదలడం అంటే ఏసీ మనస్కరించకుండా వుంది’’- అంటాడు మొదట్లో గిరీశం. గిరీశానికే కాదు గురజాడ అప్పారావుగారికే నాటకం పూర్తి చేశాక మధురవాణిని వదలాలంటే మనస్కరించ లేదు. నాటకకర్తే **I am enamoured of her** అని అనుకున్నారు పాపం. పాఠకులు కూడా మధుర వాణిని వదలాలంటే నాటకం పూర్తయాక కూడా వదలలేక బాధ పడతారు. ఆమె అలా నాటకం పూర్తయాక కూడా యివతలకు వచ్చి మనతో కబుర్లు చెబుతూ వుండిపోతే బావుండును అని అనిపిస్తుంది. ఇంతెందుకు? కన్యాశుల్కం చదివి మధురవాణి కోసం బెంగ పెట్టుకోనివారుంటారంటే నమ్మ శక్యం కాదు. మధురవాణిని ఎత్తుకుని ఎక్కడిక యినా పారిపోవాలనిపిస్తుంది నిజానికి. ఈ ముక్కే రావి శాస్త్రిగారన్నారొకసారి –మధురవాణి మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి వస్తే ఏంచేస్తారని అడిగా. ఇంటర్వ్యూ ఎందుకండీ బైమ్‌వేస్ట్–ఎత్తుకుని పారిపోతానని కాబోలు అన్నారు. గురజాడ అప్పారావుగారేతను సృష్టించిన మధురవాణిని మోహించి కాస్త తత్తరపడ్డారు నాటకం పూర్తి చేశాక.

కన్యాశుల్కం వంటి చీమూ నెత్తురూ వున్న పాత్రలతో మహత్తరమైన నాటకం పూర్తి చేశాక అప్పారావు పంతులుగారు ఎంత **restless**గా **feel** అవుతారో వూహిస్తే ‘మధురవాణి’ పాత్ర గురించి ఆయన బెంగ కొంత అర్థం చేసుకోవచ్చును. తిక్కన గారు మహాభారత రచన పూర్తి చేశాక అలాగే **restless**గా **feel** అయి వుంటారు. అప్పారావుగారు ఒంగోలు ముని సుబ్రహ్మణ్యంగారికి రాసిన లేఖలో **Have I made vice attractive?** అని మధురవాణి గురించి మథన పడ్డారు.

చారిత్రాత్మకమైన యీ అప్పారావుగారి లేఖను గుడిపాటి వెంకటచలంగారు తెనుగు చేశారు. చలంగారి అనువాదాన్ని యథాతథంగా యిక్కడ పొందుపరుస్తు న్నాను.

‘‘కన్యాశుల్కం ప్రూఫులు దిద్దుతున్నాను. చదువుతోంటే నాకు ఆహ్లాదం కలుగు తోంది. గ్రంథకర్త తన పుస్తకాల్ని చదివి తానే ఆశ్చర్యపడితే గ్రంథంలో నిజమైన స్వారస్యం వుందన్నమాటే. గ్రంథకర్తకే పుస్తకం ఆకర్షకంగా వుంటే అందరికీ వుంటుందని నిశ్చయమే. మీనాక్షి వొచ్చిన రంగాలు చాలా జ్ఞానాపాదకాలుగా వున్నాయి. నేను పూర్వ గ్రంథాల్లోంచి ఉదాహరణ లివ్వగలను.

(కళా దృష్టితో ఆదర్శవంతంగా) చేసినప్పటికీ Artistic Idealisation కూడా Realistic (ఉన్నదున్నట్టు)గా వ్రాసినట్లయితే ప్రజల నీతి అభిప్రాయములకు విరుద్ధంగా వుండే ఘట్టాలు తటస్తించక మానవు. కొంతవరకు నైతిక ఖండనం ప్రత్యేక తత్వాల మీద ఆధారపడి వుంటుంది. మీజాతి పట్టాభి రామమూర్తిగారి సహవాసంలో మీరు పెరగడం వల్ల మీకు అవినీతి అంటే కంటకమని నాకు తెలుసు. వేశ్య అనేసరికి అదిరిపడతారు.

కావ్యాల్లోని న్యాయస్మృతి Poetic justice (కావ్య న్యాయం)లో మారింది. నేను జీవితాన్ని చిత్రిస్తున్నాను. కళాపరంగా కొంత ఔన్నత్యాన్నిస్తాను.

నేను కళారాధకుణ్ణే. ఐనప్పటికీ సంఘం యెడల బాధ్యత వుంది నాకు. నా పుస్తకం చదివేవారు నన్ను వొక ప్రశ్న వెయ్యవచ్చు; నేను దుర్మార్గాన్ని ఆకర్షణీయంగా చేశానా అని. చెయ్యలేదని నా నమ్మకం. మొదటి ముద్రణలో మధురవాణి జీవం లేని ఘోరంగా తయారైంది. ఈ ముద్రణలో ఆమెను పూర్ణంగా చిత్రించాను. నేనే ఆమెను చూసి భ్రమసి పోతున్నాను. కనుక ఆమెని చివర రంగంలో సంస్కరణం చేశాను. ఇంక మీకు అభ్యంతరం వుండకూడదు.

పైకి కనబడేదానికన్న బలమైన నైతిక భావాన్ని పొందింది నా పుస్తకం. జీవితాన్ని నేను చులకనగా భావించనని తెలుస్తుంది. హాస్యంతో పొంగిపొయ్యే పుస్తకంలో జీవితంలో గంభీరత్వాన్ని చూపడం చాలా కష్టమైన పని. ప్రయత్నించాను నేను.

వేశ్యలోని మానుషత్వాన్ని మరచిపోకండి. ఆమె సుఖదుఃఖాలు మీవిగానీ, నావిగానీ అయిన సుఖదుఃఖాలకు ప్రాముఖ్యతలో తీసిపోవు. సంఘంలో లెఖ్ఖలేని వ్యభిచారులైన భర్తలూ, భార్యలూ వున్నారు. స్పష్టంగా తన వృత్తిని తెలియబరిచే వేశ్య వారందరి కన్న అధమురాలెట్లా అవుతుంది? పైగా వేశ్య వివాహ ప్రమాణాన్ని భగ్నం చెయ్యడం లేదు వీళ్ళవలె.

'ఆంత్రోపాలజీ' (పురాతన మనుష్యుల చరిత్ర నుంచి తెలుసుకునే శాస్త్రం) వల్ల మన సాంఘికాభిప్రాయాలు మార్చుకోవలసిన అవసరం కలిగింది. స్పష్టంగా గోచరించే విషయాన్ని కప్పిపుచ్చడం వల్ల ఏమీ లాభం లేదు.

వివాహ (Sexual) బంధాలను ఇంతగొప్ప చెయ్యడంలో అర్థమేమిటి? సాంఘిక పరిణామంలో వివాహసంస్థ యొక్క ప్రాముఖ్యతను నేను తగ్గించ చూస్తున్నాననుకోకండి. గడిచిన శతాబ్దంలో ప్రపంచం జ్ఞానంలో మారింది. వివేకవంతులైన మనుష్యులు పాత అభిప్రాయాల విలువను పరీక్షించడం ప్రారంభించారు. వివాహసంస్థ మానవాభివృద్ధికి తోడ్పడిన మాట వాస్తవమే కాని వివాహబంధం ఛేదించకూడదనే అభిప్రాయం వల్ల ఎన్ని చెప్పతరంకాని దారుణ కృత్యాలు తటస్థిస్తున్నాయో మరవకూడదు. అంతేకాదు. ఇంగ్లీషువారిలో పెళ్ళి (సివిల్ కాంట్రాక్టు) చట్టసంబంధమైన వొడంబడి

కగా వుంది. షెల్లీ, జార్జి ఇలియట్ వాన్ని తోసేసి తిరిగారు. (Modern Woman will rewrite history). నవీనయుగపు స్త్రీ చరిత్రను పునర్లిఖింపబోతోంది.

గొప్ప నవలలో ప్రేమకథ అపురూపమవుతోంది లేక ప్రాముఖ్యతలేని స్థానానికి వెడుతోంది. ఈ స్త్రీ పురుష శరీర ఆకర్షణ విషయమై వాఙ్మయం ఎందుకు అవంతమైన భేదాలతో చిత్రిస్తుంది? కామ (Sexual) సంబంధమనే మాటను గమనించండి. శుద్ధ శరీర సంబంధాన్ని స్పష్టంగా చూపుతోంది. వాడిలిపోయిన యాభై ఏళ్ళ సుందరిని యువకుడెందుకు మోహించడు? చక్కగా వికసించిన రోజా పువ్వు వలె, బాగా వుడికే కూరవలె యవ్వనవంతురాలు యింద్రియాల్ని ఆకర్షిస్తుంది. పాచిన ఆహారం గాని, వాడిలిన పువ్వుగాని ఎంత అయిష్టమో ముదిరిన స్త్రీ కూడా అంతే. ముందెప్పుడో రొట్టె పాచి పోతుందనిగాని, రోజా వాడిలిపోతుందనిగాని అవి కొత్తగా, మనోహరంగా వున్నప్పుడు ఎవడన్నా అనుభవించడం మానుకుంటాడా? జీవితమూ, సౌందర్యమూ అశాశ్వతములనే వేదాంతం సరైనది కాదు. పైగా తరుణ మందే అనుభవించాలనే అభిప్రాయానికి బలమైన ప్రోత్సాహ కారణమౌతుంది. పాపం అమితత్వంలో వుంది. అమితత్వం ఎక్కువకాలం ఎట్లాగూ దాగదు.

జీవితంలోనూ, వాఙ్మయంలోనూ కూడా మోహం తన ఉచిత స్థానాన్ని అధిష్టించాలి. ప్రస్తుతం దానికి అమితమైన ప్రాముఖ్యాన్నిస్తున్నారు. 'కేటో' తన భార్యని ఎవరికో ఎరువిచ్చాడు. పురాణాలు చదవండి తెలుస్తుంది.

నిజంగా జరుగుతున్న సంగతుల్ని చూడాల్సి వొస్తుందని కళ్ళు మూసుకోవద్దు. డాక్టరులాగు కత్తి తీసి పుండుకోసి పరీక్షించాలి. ఆశయంగా చూపించ తగినది మానవుడి ప్రేమ. క్రీస్తు బోధించిందిగాని, బోధించాడని అనుకునేదిగాని అదే. తన కవిత్వంలో షెల్లీ చాటింది ఆ ప్రేమే. జీవించే మతంకింద బుద్ధుడు బోధించింది ఆ ప్రేమనే. బౌద్ధమతాన్ని యేనాడు నాశనం చేసిందో ఆనాడే హిందూదేశం మతీయమైన ఆత్మహత్య చేసుకుంది.

ఈ ఆచారాలనే యెర్రకాంతిని పరిశోధనాలయం (Laboratory) నుంచి తొలగించి, యీ కామ సంబంధాన్ని పూర్తిగా, వివరంగా పరీక్షించాలని నా కోరిక. చరిత్రాత్మ జీవశాస్త్రాత్మకంగా (biologically) పరిరక్షించి, దాని సరియైన స్థానాన్ని యీ కామానికి ప్రసాదించి తీరాలి. జీవితంలో యథార్థాన్ని మీరు ప్రేమిస్తున్నారు. 'సెన్టిమెంటు' లోని యదార్థాన్ని యెందుకు ప్రేమించరు? పురుషుడి అధికారం కింద యెంత నీచమైన బానిసత్వాన్ని స్త్రీ అనుభవిస్తుందో నాకు తెలుసు. మీరు మాత్రం ఆలోచించుకోలేరా?

బీదలూ, కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భర్తల విషయమై ఆ భార్య లేమనుకుంటూ వుంటారో ఆలోచించుకోండి. మీచుట్టూ కనపడే కుటుంబాలను 'స్టడీ' చెయ్యండి. కురూపులూ, దుర్మార్గులూ, బలహీనులూ ఐన భార్యలో?

అంటారు మీరు. కాని వారు పురుషుల బానిసలే కద. మనకన్న ఆడవాళ్ళు ఎక్కువ పవిత్రత చూపాలని విధిస్తున్నాము. దానివల్లనే యింత వ్యత్యాసం కలుగుతోంది. నిర్మలులుకాని పురుషులందరినీ మీరు ద్వేషిస్తారనుకోండి పనిబట్టి. ఇంక మీరు ద్వేషించని స్నేహితులు ఎంతమంది మిగులుతారు? స్త్రీకి సాధ్యమైన దానికన్నా ఎక్కువ ప్రజ్ఞను పురుషుడు కోరుతున్నాడు గనక స్త్రీ బాధ పడుతోంది. తన మనసు తీరేట్టు, స్త్రీ తనని పూజించడం లేదని పురుషుడు దుఃఖభాజనుడైనాడు. 'జెలసీ' అంటే యేమిటి? భర్త అందంగా లేడు. భార్య అతని రూపాన్ని యెట్లా మెచ్చుకుంటుంది? అందంగావున్న పర పురుషుడి యెడల అనురాగాన్ని ఆపుకోలేదు. కాని అట్లాంటిది మహాపాతకమంటారు మీరు. ఎంత దుస్సాధ్యం? భర్త చవట అయినా భార్య మాత్రం ఆయన మేధాశక్తుల్ని మెచ్చుకునే తీరాలి. ఇట్లా ఎంతవరకన్నా. ఎన్ని విషయాల్లోనో వూహించుకోవచ్చు యీ అగచాట్లు.

జపానులో గెయిషా పద్ధతి సంగతి వినేవుంటారు మీరు. కామ విషయమైన నీతి జపానులో చాలా తక్కువ. కాని వారి జాతీయతకికాని, మత జీవనానికి గాని, భాగ్యసమృద్ధికిగాని యే లోటూ రాలేదు. ఆశ్చర్యం యేమిటంటే, ఆ దేశంలోనే ముఖ్యంగా గొప్ప రాజకీయ ఆదర్శాలున్నాయి.

సెంటిమెంట్ అవతల పెట్టి యీ కామవిషయమై నా అభిప్రాయం యిదీ. సంఘం వల్ల విధింపబడిన చట్టాలు వున్నాయి, వాటిని మన్నించడం మన విధి. కామ వ్యవహారాన్ని శాంతంగా నడిపించేందుకు అవి వుండవల్సిందే.

ఆ చట్టాలు అన్యాయమని తలిచి వాటిని బహిరంగంగా సంస్కరింప పూనినప్పుడు తప్ప వాటిని మీరడం గొప్ప నేరం. ఆ చట్టాలకి లోబడి వున్నా వాటిని పరీక్షించి వాటి న్యాయాన్యాయ విచారణ చేసేందుకు ప్రతివారికీ స్వతంత్రం వుంది. నిర్మలత్వం అవసరం అనే సెంటిమెంటుని నేను మన్నిస్తాను. కాని ఆ సెంటిమెంటు యొక్క నిజస్వభావ మేమిటి, దాని హద్దు లెంతవరకు, దాని అసలు అర్థమేమిటి, అది ఏ మార్గంగా పని చేస్తోంది, నిర్మలత్వ మంటే దేంటోవుంది? నేను నమ్ముతున్న దేమిటంటే ప్రస్తుత సాంఘిక శాసనాలు ఈ కామ విషయమై ఎవరికీ అందుబాటులో లేనంత కఠినంగా వున్నాయి. కనకనే నేరాలు మీరిపోయినాయి. మనలో మనం వాస్తవం వొప్పుకోవలసిన కాలం వొచ్చింది. ఇదంతా ఎందుకు వ్రాశానంటే నేను వ్రాయబొయ్యే నాటకం యీ సమస్యల్ని గురించి.'' అని వ్రాశారు అప్పారావుగారు.

విజయనగరంలో ఆనందగజపతి మహారాజా వారి సంస్థానంలో వారి అధీనంలో రామస్వామి, వెంకటస్వామి అనే యిద్దరు వేశ్యా రత్నాలు వుండేవారట. వారిలో 'రామస్వామి' కడు పెంకి. వారిరువురినీ గురజాడ అప్పారావు పంతులుగారు కంట్రోలు చేసేవారట. ఈ రామస్వామి, వెంకటస్వామి అనే ఆనందగజపతి మహారాజా వారి ఉంపుడుకత్తెల గురించి కృష్ణశాస్త్రి గారికీ, రాయప్రోలు వారికీ బాగా తెలుసు.

ఇది యిలా వుండగా విజయనగరంలో 'మహాలక్ష్మి' అనే వేశ్యారత్నము వుండేదట. ఆవిడ మహా సంగీత విద్వాంసురాలు. ఆనందగజపతి మహారాజు గారైనా ఆమెకు మూడ్ వచ్చి ఆమె పాడితే వినాల్సిందేకాని పాడమంటే ఆమె పాడేది కాదట. మొట్టమొదటి కన్యాశుల్కంలో ఈ మహాలక్ష్మి అనే వేశ్యారత్నం పాత్ర వుంది. ఈమె గిరీశం వుంచుకున్న సాని అని మొదట్లో వుంది. తరువాత ఈమె పేరు కొట్టివేశారు అప్పారావుగారు.

ఆనందగజపతి మహారాజావారికి బాలాజీనాయుడు అనే ఏజెంటు మద్రాసులో వుండేవాడు. వారి మేనగోడలు రామతిలకం అనే ఆమె ఎల్లప్పుడూ మహారాజావారితోనే గడిపేది. ఆమెకు రాజావారి వద్ద ఎక్కువ స్వేచ్ఛ వుండేది. ఈ రామతిలకానికి తాగుడు అలవాటు బాగా వుండేది. అప్పుడప్పుడు తప్పతాగి స్పృహ తప్పిపోయేది. ఈమెకు అప్పారావుగారంటే భయం భక్తీనూ. మృచ్ఛకటికంలోని వసంతసేన ప్రేరణతో అప్పారావుగారు మధురవాణిని స్వకపోల కల్పితంగా తీర్చిదిద్దారు. కన్యాశుల్కం రెండవ ఎడిషన్ లోని మధురవాణి మీద అప్పారావుగారి పై పరిచయాల సారం అంతా దిగిందని అనుకోవచ్చు.

అప్పారావుగారు రామస్వామి అనే వేశ్యా రత్నంతో మహారాజావారితో కలిసి చీట్లాట ఆడి వుండవచ్చును. ఈ వేశ్యలు బ్రాందీ పుచ్చుకునేవారట. మధురవాణిగాని గిరీశంగాని ఒక్క రామప్ప పంతులు తప్ప ఎవరూ మద్యం సేవించరు. గిరీశానికి చుట్ట కాల్చే వ్యసనం వుండేది. గురజాడ అప్పారావుగారు మాత్రం కోకో వైన్, పురిడి పిట్ట మాంసం తీసుకున్నట్లు ఆయన రాతల్లో వెల్లడయింది. రీవారాణి సేవలో అప్పారావుగారు కొన్ని అలవాట్లు చేసుకున్నట్లు తెలుస్తున్నది. ఈ డైరీలు నోట్సులు పరిశీలించి తిరగరాసిన సందర్భంలో నార్లవారు అప్పారావు పంతులుగారిమీద అభిప్రాయాన్ని మార్చుకున్నారు. అప్పారావుగారు ఆనందగజపతి మహారాజుకి రామస్వామికి వెంకటస్వామికి మధ్య 'డాఫర్' పనిచేశారని విసుక్కున్నారు. వ్యక్తిగత శీలం స్వచ్ఛత విషయానికి వస్తే వీరేశలింగం పంతులుగారితో అప్పారావుగారు తులతూగలేరని గమనించి కోపం తెచ్చుకున్నారు. సాహిత్య అకాడెమికి రాస్తున్న గురజాడ మీద మోనోగ్రాఫ్ ఆ కారణంచేత ఆలస్యమయింది కూడా. రామస్వామిని వుంచుకున్నారని ఆనందగజపతి మహారాజావారి మీద భిన్నాభిప్రాయాలు కలిగి వున్నారుగాని అప్పారావుగారికి రామస్వామి మీద కోపం లేదు. అది ఆమె వృత్తి అని వారు సరిపెట్టుకున్నారు. అప్పారావుగారు రామస్వామి బాధ్యత స్వీకరించాక ఆనంద గజపతి మహారాజావారు యిలా అన్నారని అప్పారావుగారు రాసుకున్నారు. **(H.H.).**

'విద్యావంతులు ఆడవారి పట్ల దయగా ఉంటారు. మీకు అధికంగా ఋణపడ్డాను. చర్మం కోసి యిచ్చినా మీ ఋణం తీర్చుకోలేను.' మహారాజావారికి పత్నీ వియోగం (15-5-1896) సంభవించాక రామస్వామి వచ్చి రాజావారితో జీవించసాగింది. ఆమె

గురించి అప్పారావుగారు తీసుకున్న శ్రద్ధను కీర్తిస్తూ యింకా రాజావారు యిలా అన్నారట–'లోకులు ఉదాత్తమైన ఉద్దేశాలను అర్థం చేసుకోలేరు. మిమ్మల్ని చూసి అతగాడు ఆ పిల్ల మీద మర్లుకొని ఆమె వద్దకు వెళుతున్నాడేమో, లేదా ఆవిడ ద్వారా ఏదో లాభం చేసుకొందామనుకొంటున్నాడు కాబోలుననో, కాదంటే రాజావారి ఇచ్చకం కోసం ప్రాకులాడుతున్నాడనో అంటూ అజ్ఞానులూ, అవివేకులూ పరి పరి విధాల లేనిపోని నిందలు వేయడానికి ఆస్కారమున్నా దేనినీ లక్ష్య పెట్టకుండా మీరు ధైర్యంగా మలుచుకొచ్చారు.' ఇవి ఆనందగజపతి నుండి అప్పారావుగారు పొందిన ప్రశంసలు. అయితే యీ అనుభవం లేకపోతే గురజాడ మధురవాణిని తీర్చిదిద్ద గలిగి వుండేవారు కాదేమో! చూసీచూడనట్లు అప్పారావుగారు ఆడవాళ్ళను లోతుగా పరిశీలించెవారు.

ఆనందగజపతి మహారాజావారి స్వంత నౌఖరీలో ఉండే భోగం పాపలందరినీ అప్పారావుగారు చాలా నిశితంగా పరిశీలించారు. వాళ్ళ కళ్ళలోనే వారి స్వభావాన్ని, శీలాన్ని చదవడానికి ప్రయత్నించారు. కరుణ కళ్ళు లోతు కళ్ళు. రామస్వామి కను బొమ్మలు విశాలంగా సొగగా తెలివితేటలను సూచిస్తాయి. భాస్కరం కళ్ళు నిద్ర మత్తుతో తూగుతూ ఉంటాయి. చంద్ర వదనవి ప్రశాంతమైన చూపులు. ఆమె చెల్లెలు కళ్ళలో అన్నీ అలోచనలే—యిలా సాగేవి అప్పారావుగారి ఆలోచనాలోచనలు. మధురవాణిని తీర్చి దిద్దడానికి యీ అనుభవాలు చాలవా? మధురవాణికి తల్లి చెప్పిన నీతులు అవి సౌజన్యారావు వద్ద ఏకరువు పెడుతుంది. ఒకటి 'చెడని వారిని చెడగొట్టవద్దని'. ఇంకోటి 'మంచివారి యెడల మంచిగాను, చెడ్డవారి యెడల చెడ్డ గానూ ఉండమని.' 'మొగవాడికయినా, ఆడదానికయినా నీతి వుండాలి' అంటుంది ప్రారంభంలో మధురవాణి. మధురవాణికి డబ్బు విలువ బాగా తెలుసు—''కొద్ది కాలం వుండే యవ్వనాన్ని ఆధారంగా చేసుకొని బతికే మా కులానికి వలపు ఒక్కచోటే-(అది ఎక్కడంటే) బంగారం మీద. శృంగారం వన్నె చెడిన దగ్గర్నుంచీ బంగారం గదా వన్నె తేవాలి'' అంటుంది కరటక శాస్త్రులతో. మధురవాణి గురించి సౌజన్యారావుపంతులు యిలా చక్కగా అంటాడు—'నువ్వు మంచిదానివి! యెవరో కాలు జారిన సత్పురుషుడి పిల్లవై వుంటావు (విశ్వామిత్రుడు+మేనక = శకుంతల లాగ). యీ వృత్తి మానలేవా? స్థితిలోపమా? అంటాడు. మధురవాణి కన్యాశుల్కం నాటకాంతమందు వృత్తి మానేస్తుంది.

అప్పారావుగారి మధురవాణిని కన్యాశుల్కంలోంచి తప్పించి మన మధ్యకు తెచ్చు కుంటే ఆమెతో ఊహాజనిత ఇంటర్వ్యూలు ఎలా వుంటాయో ముందు ముందు చూద్దాం! ★

# హేతువాదం–మానవవాదం

– రావిపూడి వెంకటాద్రి

మానవుణ్ణి గురించి అనాదిగా కొన్ని అభిప్రాయాలుంటూ వచ్చాయి. అవి ఎంత మారినా, మత వాసనలను పోగొట్టుకోలేక పోయాయి. మొత్తం మీద మతాలన్నీ మనిషినీ, అతని చుట్టూ వున్న ప్రకృతినీ, ప్రకృతికి అతీతంగావున్న దేవుడు సృష్టించాడని నమ్ముతాయి. అలా సృష్టి భావాన్నీ, సృష్టికర్త భావాన్నీ పోషించిన మతాలు ఆ నమ్మకానికి ఆధారమేమిటో చెప్పవు. మత గ్రంథాలు చెప్పాయి కాన నమ్మమంటాయి. సృష్టికర్త గురించి కూడా ఏ మతం దారి ఆ మతానిదే కాని ''అతను ఇలాంటి వాడు'' అని ఏ మతమూ ఇదమిత్థమని తేల్చి చెప్పదు.

కాగా, చార్వాక బౌద్ధాదులూ, సాంఖ్య వైశేషికాది దార్శనికులూ సృష్టిఅనేది జరగలేదనే (అజాతి) వాదాన్ని వెల్లడించారు. వారిని అనుసరించి గౌడపాదుడు అజాతి సిద్ధాంతాన్ని మరింత వివరించాడు మాండూక్య కారికల్లో. ఆదిశంకరాచార్యుడు తన భాష్యాల్లో దాన్ని మరికొంత వివరించాడు. కాని, అది అతనికి జీర్ణమైనట్లు లేదు. అందుకు తగ్గ ఆధారాలు అతని భాష్యాల్లోనే వున్నాయి. అంతేకాక, ఆయన శాఖీయులు పౌరాణికులయ్యారు తప్ప, అజాతివాదాన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

ఆధునిక విజ్ఞానం గత 150 సంవత్సరాలుగా మనిషిని గురించి అనేక వాస్తవికాంశాలను పరిశోధించి వెల్లడించింది. చదువుకున్న వారికి చాలామందికి అవి తెలుసు. అయినా మనిషి దగ్గరకు వచ్చేటప్పటికి వారు చదువుకున్న శాస్త్ర పరిజ్ఞానం పనిచేయడం లేదు. వారు సృష్టివాదాన్ని నమ్ముతూనే వున్నారు.

అయితే, ఈ మనిషి ఎలా వచ్చాడు? ఈ ప్రశ్నకు సరైన మార్గంలో సమాధానం చెప్పడానికి దాదాపు 150 ఏండ్ల నాడు ఆధునిక విజ్ఞానశాస్త్రంలో జీవశాస్త్ర విభాగానికి అవకాశం దొరికింది. అంతకుముందు ఈ విశాల విశ్వంలో నెబ్యులాలు, నక్షత్రాలు, గ్రహాదులు ఎలా ఏర్పడ్డాయో వివరించే పరిణామక్రమాన్ని శాస్త్రజ్ఞులు ప్రతిపాదించారు. జీవుల విషయంలో కూడా అలాంటి పరిణామం జరిగినట్లు చార్లెస్ డార్విన్ గత శతాబ్ది మధ్యభాగంలో వెల్లడించాడు. ఏ జీవికి ఆ జీవిని దేవుడో, మరొకరో సృష్టించలేదనీ, సూక్ష్మ జీవరాశి నుంచి జరిగిన పరిణామంలో వివిధ వృక్ష, పక్షి, జంతు జాతులన్నీ ఏర్పడి, ఆక్రమంలో ఒక దశలో కోతివంటి జీవరాశి నుంచి మానవుడవతరించాడనీ ఆయన ప్రతిపాదించాడు. దానికి విశ్వసనీయమైన రుజువులు దొరికాయి. శాస్త్రజ్ఞులంతా దాన్ని ఆమోదించారు. అత్యంత విప్లవకరమైన జీవపరిణామ వాదాన్ని హేతువాదులూ, మానవవాదులూ, ఇతర దార్శనికులూ ఆమోదిం

చారు. అనంతరం నాటి నుంచి నేటివరకు ఆ పరిశోధనలు కొనసాగుతూనే వున్నాయి. అతి సూక్ష్మాంశాలకు కూడా వివరణల కోసం శాస్త్రజ్ఞులు అహరహం కృషిచేస్తూనే వున్నారు. మౌఢ్యాన్ని వదలుకోడానికి సిద్ధంగాలేని మతస్థులు తప్ప 'దేవుడు మట్టి ముద్దనుంచి మనిషిని చేశా'డనే వాదాన్ని ఆదరించే వారు లేకుండా పోయారు.

అందువల్ల, జంతువు మనిషికి దగ్గర చుట్టమనే విషయం ధ్రువపడింది. అంతకంటే మెరుగైన ప్రతిపాదన మరొకటి రుజువయ్యే దాక, దాన్ని సమ్మతించక తప్పని పరిస్థితి యేర్పడింది.

అయితే ''మనిషిని జంతుస్థాయికి తీసుకు వెళతారా?'' అని సణిగినందువల్ల ప్రయోజనం లేదు. ''మన తాతలు కోతులా?'' అని డార్విన్ మీదా, పరిణామవాదుల మీదా గత శతాబ్దంలో మతస్థులు తీవ్రంగా దాడి చేశారు. కాదనే దానికంటె ఔననే దానికే ఎక్కువ బలం చేకూరింది. దేవుణ్ణి వదలుకోలేని వారు ''మనిషిని ఎవరు సృష్టించారు?'' అనే ప్రశ్నను వదలి ''ఈ ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు?'' అనే ప్రశ్నను ఆశ్రయించవలసిన పరిస్థితి ఏర్పడింది.

కొన్ని అంశాల విషయంలో నేడు లేబొరేటరీలలో కృత్రిమంగానే పరిణామాన్ని సాధిస్తున్నారు. సంకర జాతులను ఉత్పత్తి చేస్తున్నారు. జన్యువులను మారుస్తున్నారు. వృక్ష–జంతువులను, 'జంతు–మానవులను' సృష్టించే స్థాయికి చేరుకున్నారు. నూతన జాతుల 'సృష్టి' అసంభవంకాదని తేలిపోయింది. సృష్టి అంటే ఏమీ లేకుండానే శూన్యం నుంచి దేన్నో బయటకు తీయడమనే అర్థం మారిపోయింది. ఉన్న పదార్థంనుంచి భిన్న ధర్మాలు కల వస్తువుల్ని (జీవుల్ని) తయారు చేయడమే 'సృష్టి' అనే అర్థం నెలకొన్నది. నిజానికి, ఏమీలేని దానినుంచి దేనినీ సృష్టించలేము. (Something cannot be created out of nothing).

మనుషులకున్నట్లే జంతువులకున్నూ పంచేంద్రియాలున్నాయి – ముక్కు, కన్ను, చెవి, నాలుక, చర్మం. అలానే జననేంద్రియాలూ, ఇతర అవయవాలూ ఉన్నాయి. మనుషుల్లో పనిచేసినంత చురుకుగా పనిచేయలేక పోయినా, జంతువులకూ మెదళ్లున్నాయి. అవయవ నిర్మాణాన్ని బట్టి వాటి వాటి ప్రత్యేకతలు వాటి వాటికు న్నాయి. కొన్ని గ్రంథులు కొన్ని జంతువుల్లో పనిచేసినంతగా మనుషుల్లో పనిచేయవు. (ఉదా: రాబందులు డజన్ల కొలది మైళ్లదూరంలో వున్న జంతు శవాలను మురకలు పట్టగలవు). మనిషి అవయవ నిర్మాణంలోని ప్రత్యేకతల వల్ల, అతని శక్తియుక్తులు, ప్రవర్తన మిగతా జంతుజాలంలోని వాటికంటె భిన్నంగాను, అధికంగాను వున్న మాట నిజం. అంత మాత్రాన మనిషిని ఈ లోకానికి సంబంధించిన వాడుగా పరిగణించక, అతనిలో ''ఏదో వుంది, అది అనిర్వచనీయం'' అని వర్ణించ బూనితే, అది మతం నేర్పిన పాఠాలను అప్పగించడమే అవుతుంది. అజ్ఞాన వారసత్వం నుంచి విముక్తం

కొనట్లు అవుతుంది. మనిషిలో జంతు వారసత్వాన్ని చూచినంత మాత్రాన మనిషి ఆధిక్యతను తక్కువగా అంచనా వేసినట్లు కాదు.

మనిషిని జంతువన్నట్లు కాదు. మనిషి అనన్యతను (Uniqueness) కాదన్నట్లు కాదు. నిజానికి దేని అనన్యత దానిదే. ప్రతి జంతువూ ఒక జాతిది వున్నట్లు మరొక జాతిది వుండదు. అలానే ప్రతి జీవిన్నీ. మనిషి మనిషే. సందర్భాన్ని బట్టి మనిషిలోని జంతువారసత్వాన్ని గుర్తుకు తెచ్చుకొన్నంత మాత్రాన, మనిషిలోని 'మానవతను' కించపరచినట్లు కాదు. వాస్తవికతను ఆమోదించినట్లవుతుంది.

నిర్జీవ పదార్థంతో తయారుచేసిన కృత్రిమ అవయవాలను మనిషి దేహంలో బిగిస్తే, అవి మామూలు అవయవాల వలెనే పనిచేస్తున్నాయి. నిర్జీవ పదార్థాలైన లవణాలు తీసుకొంటే, అవి మన శరీరంలో భాగాలై పోతున్నాయి. మత్తు మందుల ద్వారా మనిషిని బుద్ధిహీనుణ్ణి చేయవచ్చు. అంటే, జంతువులనుంచి మనిషిని వేరు చేస్తున్న ఒక విశిష్ట లక్షణాన్ని అతని నుంచి తొలగించవచ్చు. అలానే ఉద్రేకపరచవచ్చు. స్పందనలు కల్గించవచ్చు. మానసిక రుగ్మతను (ఉన్మాదాన్ని) నయం చేయవచ్చు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ తో మనోవిశ్లేషణకు శాస్త్ర ప్రతిపత్తి చేకూరింది. ఆయన అనంతరం ఈ 50 ఏండ్లలో అది మరికొంత అభివృద్ధి సాధించింది. అయినా, శైశవ దశలోనే వుంది. మనో విశ్లేషణ శాస్త్రం మన భ్రమలకు, మత భావాలకు సరైన భాష్యాలు చెప్పుకొనే మార్గం చూపింది. వివిధ శాస్త్రాల ద్వారా మనిషిని గురించి మనం చాలా తెలుసుకున్నాం. తెలియనిది ఇంకా ఎక్కువ వుండవచ్చు. ఇప్పటివరకు మనకు తెలియనిదంతా ఎప్పటికీ తెలుసుకోజాలనిది కాదు. అజ్ఞాతమంతా, అజ్ఞేయం కాదు. మనిషికున్న మానసిక ప్రవృత్తుల్లో తమకు అర్థంకాని వాటిని పట్టుకొచ్చి అయోమయంగా "వాటి గురించి ఏమి చెపుతారు?" అని ప్రశ్నించడం న్యూరోటిక్ మత వైఖరి. అందుకే మతాన్ని యూనివర్సల్ న్యూరోసిస్ అన్నాడు ఫ్రాయిడ్. "ఏదో వుంది, అది అనిర్వచనీయం, అజ్ఞేయం" అంటూ అజ్ఞానంలో దేన్నో దాచగోరేది మత వైఖరే. నేర్పితే నేర్చుకోవడం మానవుడి సామాజిక వారసత్వం. కాని, మత వారసత్వం అలా కాదు. ఒక అజ్ఞానాన్ని పారద్రోలితే, మరో అజ్ఞానాన్ని ముందుకు నెట్టి "దీన్ని గురించి ఏమి చెపుతారు?" అని సవాలు విసురుతారు. ఇలాంటి ప్రశ్నలు చాలాకాలం క్రిందటే మతస్థులు లేవదీశారు. "రాతిలోకి కప్ప ఎలా చేరింది? కొబ్బరికాయలో నీరు ఎవరు పెట్టారు? మల్లెపువ్వుకు తావి ఎలా అబ్బింది? నెమలికి నాట్యం ఎవరు నేర్పారు? కోకిల కంఠంలో మాధుర్యాన్ని ఎవరు నింపారు? సంధ్యాకాశానికి శోభ ఎవరు చేకూర్చారు? ప్రకృతి రామణీయకతకు మనసు ఎందుకు పరవశమవుతుంది?" ఇలా "యక్ష" ప్రశ్నలు వేశారు. కుతూహలం వుంటే, వీటికి సమాధానాలు తెలుసుకోవడం ఏమంత కష్టం కాదు.

మనిషికి కొన్ని విశిష్ట లక్షణాలున్న మాట నిజమే. మనిషి నవ్వగలడు, ఏడ్వగలడు, మాట్లాడగలడు, పాడ గలడు, ఆలోచించగలడు, విమర్శించగలడు, విజ్ఞానం ఆర్జించగలడు, 'ఆకాశానికి' నిచ్చెనలు వేయగలడు, బృహనిర్మాణాలు చేయగలడు, మరెన్నెన్నో చేయగలడు. జీవ జాతుల్లో మానవుడికి తప్ప, వేటికీ ఈ పనులు సాధ్యం కాని మాట నిజమే. కాని, తన అవయవ నిర్మాణంలోని విశిష్టత వల్లనే మనిషి ఈ పనులన్నీ చేయగల్గుతున్నాడు. ఆలోచనా సాధనమైన అతని మెదడు కూడా అవయవమే. ఇలా అర్థం చేసుకున్నపుడు మనిషి కూడా జీవే, జంతువే, అతడొక తరహా వైజ్ఞానిక జంతువు. జంతువుకు భిన్నమైన జంతువు. అందుకే, మనిషిని జంతువునుంచి విడదీసి మనం ఆలోచిస్తాం. ఈ మానవులంతా సమరసభావంతో సౌఖ్యంగా జీవించడానికి ఒక విధానం కావాలనుకుంటున్నాం. దాన్ని మానవ వాదమంటున్నాం. అలాకాక, మనిషిని కేవలం జంతువుగా పరిగణిస్తే, జంతువాదం–యానిమలిజం కావాలనే వాళ్లం. మధ్యలో నపుంసకలింగం జంతు–మానవవాదమెందుకు?

జీవపరిణామానికి పూర్వరంగం ప్రకృతి పరిణామం. జీవం ఏర్పడక పూర్వం నుంచీ, మనిషి ఏర్పడక పూర్వం నుంచీ ప్రకృతి (విశ్వం) వుంది. మన అంచనాకు అందిన వేల కోట్ల సంవత్సరాలుగా దాని పరిణామం సాగుతూనే వుంది. చతుర్థా విస్తృతమైన విశ్వం గురించి ఇక్కడ వివరించుకోనవసరం లేదు కాని, మనం ఇంతగా చెప్పుకొంటున్న మనిషి ఈ విశ్వంలో భాగమే; భాగమంటే చాల క్షుద్ర భాగం. క్షుద్రాతిక్షుద్ర భాగమనే అంటాడు జూలియన్ హక్స్‌లే. విశ్వ పదార్థంతోనే, విశ్వ పరిణామంలో భాగంగా, ఒక విశ్వ సంఘటనగా మనిషి ఏర్పడ్డాడు. పదార్థమంతా అణునర్తనమే. అణువు కాకుంటే మరో సూక్ష్మ భౌతిక రూప నర్తనం. పదార్థాన్ని ఏ దశలో వున్నట్లు వూహించినా, మనిషి పదార్థానికి భిన్నం కాదు. మనిషి నిర్మాణాన్ని బట్టి అతనిలోని అణునర్తనం వుంటుంది. పదార్థం నుంచి దాని ప్రవృత్తి (Function)నీ, ధర్మాల (Properties)నీ విడదీసి చూడడం ఆత్మవాదుల (Spiritualist) ధోరణి. ఆ ధోరణిని 2500 ఏండ్లకు పూర్వమే చార్వాకులు ప్రశ్నించి ఖండించారు – దేహప్రవృత్తులుగా కాక, జీవమూ, ఆత్మ అనేవి దేహానికి విడిగా ఎక్కడ వున్నాయి? అని.

అందువల్ల మనిషిని ప్రకృతినుంచి ప్రకృతిలోని పదార్థం నుంచి, ఏ జీవ జాతుల నుండి పరిణామం చెందాడో ఆ జీవ జాతులనుంచి వేరుచేసి చూచేటపుడు ఎంతవరకు వేరు చేయాలో, ఏ ప్రత్యేకతల కోసం వేరు చేయాలో తెలుసుకోకపోతే, అలాంటి మనిషి నుంచి రాబట్టగలిగేది, ఆ మనిషి గురించి చెప్పగలిగేది మానవవాదం కాదు. మనిషిని అతని స్థానం నుంచి తొలగించి స్వాప్నిక జగత్తులో తేలియాడేది మానవవాదం కాదు. మార్మికవాదం.

ఉనికి లేని పరిణతి లేదు. ఉనికి పరిణతి అవిభాజ్యాలు. మనిషి లేకుండా మనిషితనం లేదు. స్వేచ్ఛపొందే వాడు లేకుండా స్వేచ్ఛ లేదు. మానవుడి ప్రవృత్తుల్లో స్వేచ్ఛ

కూడా ఒకటి. ఎం.ఎన్. రాయ్ అన్నట్లు ''మనిషి స్వేచ్ఛగా వుండటానికి పుట్టాడు కాని, పుట్టుకతోనే అతను స్వేచ్ఛాజీవిగా పుట్టలేదు. స్వేచ్ఛగా వుండడం మానవ జీవితసారం. చుట్టుముట్టి వున్న ప్రకృతి శక్తులు అతన్ని త్రొక్కివేసి బానిసను చేస్తున్నాయి. అయితే, వాటినుంచి స్వేచ్ఛను పొందగల వనరులను కూడా ప్రకృతి అతనికి కల్పించింది. మనుగడ కోసం అతను ప్రకృతితో పోరాడాలి. ఆ పోరాటంలోనే అతను స్వేచ్ఛకొరకు పడే ఆరాటం ఇమిడి వుంది'' అందుకే మానవ విలువలన్నింటి లోకీ ప్రధానమైన విలువ స్వేచ్ఛ. ఈ స్వేచ్ఛను పొందడానికి అతను ప్రకృతి సత్యాలను (పరిసర సత్యాలను), తనను గురించిన సత్యాన్ని, ఈ రెంటికీ మధ్య వుండే సంబంధాన్ని తెలుసుకోవాలి. అందుకు అతని జ్ఞానం సహకరించాలి. జ్ఞానం అంటే వస్తువులు గోచరించగానే మనకు కలిగే సంవేదన (Sensation) కాదు. ఆ సంవేదనను అర్థవంతంగా అతకగలిగిన హేతుత్వం కావాలి. అందువల్లనే హేతుత్వం, జ్ఞానం, సత్యం, స్వేచ్ఛ అనేవి మానవ విలువలుగా ఒక శ్రేణిలో వుంటాయి. ఇలా విలువలకు ప్రాధాన్యమిచ్చే చైతన్యం (Consciousness) అడుగడుగునా నైతికతను సంతరించు కుంటుంది. హేతుత్వం అత్యంత ప్రాథమిక స్థాయిలో, సహజాత స్థాయిలో వున్న జంతుజాతుల్లో విలువలు వుండవు సరికదా, వున్నాయనుకుంటే అవి ఆ స్థాయిలోనే వుంటాయి.

ఇదంతా ఎందుకు చెప్పుకోవలసి వస్తున్నదంటే, అసలు మనిషిని వదలి, వ్యూహాలో కంలో తేలియాడడంవల్ల ప్రయోజనం లేదని చెప్పడానికే. మానవ స్వభావాన్ని ఇదమిత్థమని తెలుసుకోకుండా మానవవాదానికి నిచ్చెనలు వేయడం సాధ్యం కాదు.

అయితే హేతువాదానికీ, దీనికీ ఏమిటి సంబంధం అనే ప్రశ్న కొందరిలో తలెత్తవచ్చు. ఎందుకంటే, హేతువాద మంటే మూఢ విశ్వాసాలపై పోరాటానికి పరిమితమై వుండే విధానమని ఒక అపోహ వుంది. మతం మీద, మూఢ నమ్మకాల మీద హేతువాదం పోరాటం జరిపే మాట నిజమేకాని, అది అంత మాత్రమే కాదు. దాని లక్ష్యం ఏది హేతుబద్ధమో నిర్ణయించి దారి చూపడం; దారిలో అహేతుకమైనవి అడ్డువస్తే, వాటిని తొలగించుకొని రుజామార్గాన నడవమని చెప్పడం; అలా అది మానవవాద మార్గానికి దారితీస్తుంది. అది అర్థరహితమైన కార్యకారణ కోలాటం వేసే శుష్కతర్కం కాదు; విశ్వంలో జరిగే సంఘటనలన్నింటినీ ఆధునిక శాస్త్ర విజ్ఞాన ప్రాతిపదికపై అర్థం చేసుకుంటుంది. ఆ సంఘటనలన్నీ క్రమబద్ధం కాబట్టి, ఒక సంఘటన తెలిస్తే, దానికి ముందు–వెనుకవుండే సంఘటనలను చెప్పడానికి సాధ్యమవు తుంది. అందువల్ల క్రమ పరిణతిలోవున్న విశ్వ సంఘటనలో ఏది ముందు, ఏది వెనుక జరుగుతున్నదో, ఏది దేనివలన జరుగుతున్నదో, అది మరెలా జరగడానికి వీలున్నదో, ఎలా జరిగితే మానవ శ్రేయస్సుకు అనుకూలమో, అలా జరిగేట్లు చూచుకోడానికి మనం ఏమి చేయాలో తెలియజేసేది హేతువాదం. అందుకు అనుభ వాన్ని కూడా అది గీటురాయిగా తీసుకుంటుంది. అది నమ్మకమూ (faith) కాదు,

మతమూ కాదు, సిద్ధాంతమూ కాదు. అదొక ఆలోచనా విధానం. మతాలు వ్యవస్థీకృత మైన మూఢ విశ్వాసాలను ఆలంబనం చేసుకొని మనుగడ సాగిస్తాయి కాన, హేతువాదం అన్ని మతాలనూ తిరస్కరిస్తుంది. మతాలు మొదట ఎందుకు బయలుదేరినా, వ్యవస్థీకృతం కావడం వాటి లక్షణం. వాటి సామాజిక నడవడులకు మూఢాచార విశ్వాసాలే కొలతబద్దలు తప్ప, పెరుగుతున్న విజ్ఞానం కొలతబద్ద కాదు. శాస్త్రీయ సత్యం దాన్ని నిరాకరించినా, హేతువాదానికి నిలబడకపోయినా, మతం మాత్రం పాత పద్ధతిలోనే కొనసాగుతుంది. పైగా, శాస్త్ర పద్ధతిని సైతం సంశయిస్తుంది. అందుకే, మత పద్ధతిని హేతువాదం తిరస్కరిస్తుంది.

విజ్ఞానశాస్త్రం సత్యాన్వేషణ చేస్తుంది. ఆ క్రమంలో అది అవశ్యంగా మతంతో ఘర్షణకు తలపడవలసిన పరిస్థితి యేర్పడుతుంది. అయిన్‌స్టయిన్ అన్నట్లు అద్భుతా లకు, మహత్యాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ పరిశోధన నిరవధిక పోరాటం చేస్తుంది. ఫలితంగా మతం కల్పించిన పాత భ్రమలు, తప్పు అభిప్రాయాలు మరుగునపడి, నూతన సత్యాలతో విజ్ఞానశాస్త్రం మున్ముందుకు నడుస్తుంది. ఆ పరిశోధనలో అవసరమైతే తాను ముందు కనుక్కున్న సత్యాలను సైతం వదలుకొని, లేక మెరుగు పరచి సమగ్ర సత్యం వైపు పురోగమిస్తుంది. అలా విజ్ఞానశాస్త్రం నిత్యమూ ఇతోధిక జ్ఞానాన్ని ప్రోగు చేసుకొంటుంది. అది సంపాదించే జ్ఞానమంతా ప్రకృతిని గురించిన జ్ఞానమే. ప్రకృతికి అతీతమైన, ప్రకృతి జ్ఞానానికి అన్యమైన జ్ఞానం లేదు. అనిర్వచనీ యత అనేది విజ్ఞాన శాస్త్ర నిఘంటువులో లేదు. అజ్ఞేయత అనేది విజ్ఞాన శాస్త్ర పరిభాషలో ఇమడదు. హేతుబద్ధంకాని అంశమే విజ్ఞానశాస్త్రంలో వుండదు. శాస్త్రీయ సత్యాలను ఆలంబనం చేసుకొని మానవుడు తన జీవితంలో వేటిని అనుసరించాలో, వేటిని తిరస్కరించాలో హేతువాదం చూపుతుంది. అందువల్ల హేతువాదం శుష్కభావాలను త్రోసివేస్తుంది. నికరమైన, నిజాయితీ కల భావాలవైపు తన ఆచరణను మలచుకొంటుంది.

కాబట్టి హేతువాదం మంచి జీవన తత్వాన్ని ఏర్పరచుకోడానికి మనిషికి సహాయం చేస్తుంది. అలా హేతువాదం ఆమోదించే జీవనతత్వం, తాత్విక దృక్పథం మానవవాద మని తేలుతుంది.

మానవుడిలో దయ, దాక్షిణ్యం, కరుణ, జాలి, ప్రేమ వగైరా స్వభావాలు వున్న మాట నిజం. కాని, వాటికి వ్యతిరేకమైన క్రౌర్యం, మాత్సర్యం, కక్ష, క్రోధం, ద్వేషం వగైరా స్వభావాలు కూడా మనిషిలో వున్న మాట వాస్తవం. ఈ రెండవ బాపతు క్రౌర్యాదులను కాక, మొదటి బాపతు దయా దాక్షిణ్యాదులనే మనిషి ఎందుకు ఆచరణలో పెట్టాలో నిర్ణయించేది అతనిలోని హేతుత్వం, చైతన్యం. మానవ స్వభావాన్ని అవగాహన చేసుకొనని వాడు తులనాత్మకంగా ప్రవర్తించలేడు. అందువల్ల మానవునిలో సరైన జ్ఞానం, చైతన్యం వున్నపుడే సరయిన మానవతా ప్రదర్శన సాధ్యమవుతుంది.

(తరువాయి వచ్చే సంచికలో)

# శ్రవ్యశిల్పి బాలమురళి

– డా. సంజీవ దేవ్

వైజ్ఞానిక విజ్ఞత మనిషి తలలోని ఎడమ అర్ధ గోళంలోను, కళాభిజ్ఞత కుడి అర్ధ గోళంలోను ఉంటుందని మనోవిజ్ఞానం చెపుతుంది.

ఏది ఎటు ఉన్నా ఇబ్బంది లేదు. అసలు ఏదీ ఎటూ లేకుండా ఉన్నప్పుడే ఇబ్బంది.

కళ మనిషికి అవసరమా లేదా అనే వివాదం పాతబడి పోయింది. అవసరం, అవసరం కాదు రెండూ కూడ.

కొందరికి అవసరం, మరికొందరికి కాదు. అవసరం అయిన జనసంఖ్య చాలా ఎక్కువ, అనవసరమైన జనసంఖ్య చాలా తక్కువ.

ప్రతి కళాసృష్టికీ కళాకారునికి బయటున్న జగత్తులోని ప్రేరణ, కళాకారుని లోని ప్రతిస్పందన అవసరం.

సంగీతానికీ అంతే.

సంగీతానికి ప్రధానంగా రెండు విధాల వ్యక్తులు అవసరం–వాగ్గేయకారులు, గాయకులు.

గీతాన్ని రచించేవారు మొదటివారు, గీతాన్ని సంగీతంగా గానం చేసేవారు రెండవవారు. ఇద్దరూ ఒకరే అయిఉండటం అరుదు.

శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఆ యిద్దరులో ఏ ఒకరు మాత్రమేకాక ఆ యిద్దరూ కూడా.

ఆయన నిపుణ వాగ్గేయకారుడు, మధుర గాయకుడూ కూడ.

చిత్రకళలో చిత్రాన్ని రచించిన వానిదే ప్రాధాన్యం కాని ఆ చిత్రాన్ని ప్రేక్షకులకు చూపేవానిది ప్రాధాన్యం కాదు.

సంగీతంలో పాటను రచించిన వాని కంటే శ్రోతలకు ఆ పాటను వినిపించే వానిదే ఎక్కువ ప్రాధాన్యం.

శ్రీ బాలమురళీకృష్ణది కూడ అంతే.

చిత్రకళ భాషను దాటిన కళ. తెలుగు చిత్రకారుడు రచించిన చిత్రాన్ని పంజాబీ ప్రేక్షకుడు, మళయాళీ ప్రేక్షకుడు, ఫ్రెంచ్ ప్రేక్షకుడు, ఎవరైనా చూచి ఆనందించగలరు. అందుకు భాష అడ్డురాదు.

ఉత్తమ సంగీతం కూడ అంతే. ఇక ప్రత్యేకించి రాగాలాపనను గురించి చెప్పనే అవసరం లేదు.

రాగం శబ్ద నిర్మితమే కాని పద నిర్మితం కాదు.

పదప్రధానమైన కృతినో, జావళీనో, మరో గీతాన్నో వింటున్నప్పుడు అందులో ఏ మాటలు వినిపిస్తున్నాయో, వాటి అర్థం ఏమిటో అనే దానికంటే అది ఎట్లా వినిపిస్తున్నదీ అనేది ప్రధానం.

ఒక పాటలోని విషయవస్తువు ఎంత ఉదాత్తమైన దైనప్పటికీ ఆ పాడటంలో

అవలయ తడితే శ్రోతలు దాన్ని మెచ్చుకో లేరు.

శ్రీ మంగళంపల్లి కుశల గీతకారుడు, సంగీతకారుడు కూడ. అయినప్పటికీ మొదటిది నేపథ్యంలో ఉంటుంది, రెండ వది తెరకు బయట ఉంటుంది.

ఆధునిక ఆంధ్ర సంగీత శిల్పుల్లో- ఆంధ్ర మాత్రమే కాదు, యావద్భారత శిఖర సంగీత శిల్పుల్లో- శ్రీ మంగళంపల్లి ఒకరు.

ఆయనది ప్రధానంగా కర్ణాటక సంగీత మైనా, హిందుస్తానీ సంగీతాన్ని కూడ ప్రతి భతో ప్రదర్శించగలడు.

గాత్రశిల్పి మాత్రమే కాక ఆయన వాద్య శిల్పి కూడ. వైలిన్‌ను వాయించ గలడు, దానికంటే భిన్నమైన వయోలాను ఇంకా ఎక్కువ దక్షతతో వాయించగలడు.

ఈ తంత్రీ వాద్యాలను మాత్రమే కాక తాళవాద్యాలైన మృదంగం, ఖంజరీ మొద లైన వాటిని కూడ వాయించటంలో ఆయ నకు నేర్పరితనం ఉన్నది.

ఈ విధంగా ఆయన సంగీత జగత్తుకు సంబంధించినంతవరకు మహామహోపా ధ్యాయులలో ఒకరు.

కొందరు గాయకుల గాత్రాలు పంచమ స్థాయిలో ఉంటే కొందరివి మందరంలో మాత్రమే ఉంటాయి.

ఒకటి కంచు మ్రోగినట్లు తీవ్రంగా ఉంటే, రెండవది కొయ్య మ్రోగినట్లు మాంద్యంగా ఉంటుంది.

కాని శ్రీ బాలమురళీ గాత్రం ఈ రెంటి సమ్మేళనం కలిగి శ్రావ్యమైన మేళంగా వినిపి స్తుంది.

ఎక్కువ మంది సంగీత శిల్పులు ఇది వరలో వాడుకలో ఉన్న మేళకర్తలను, వాటి జన్యాలను (రాగ రాగిణీలు) పాడతారేకాని తాము స్వీయ రాగాలను నిర్మించుకోరు. పాటలను రచించుకున్న వారున్నారు కాని రాగాలను నిర్మించుకున్నవారు అరుదుగా, మహా అరుదుగా మాత్రమే ఉంటారు.

కాని శ్రీ బాలమురళి పాటలను తెలుగు లోను, తమిళంలోను నిర్మించటమే కాక స్వీయ రాగాలను కూడ ఎన్నో నిర్మించారు.

గేయస్రష్ట అయినట్లే ఆయన రాగ స్రష్ట కూడ. కొందరు రాగ స్రష్టల్లో అనురాగం లోపించి మానవత అభావిస్తుంది.

ఆయన మానవత లోపించని అనురాగ సహిత రాగస్రష్ట. ఆయన ఎంత రసమయ సంగీతాన్ని ప్రదర్శించగలడో అంత గాఢ మైన సంగీత విజ్ఞానాన్ని కూడ కలిగి ఉండడం ఒక విశిష్టత.

చెపుతారు, శ్రీ బాలమురళి తన నాలుగో సంవత్సరంలోనో లేక ఏడో సంవ త్సరం లోనో గానం చేయటం ప్రారంభిం చాడని.

కొందరు పుట్టు కళాకారులుగా పుట్టి తరువాత నేర్చుకొని ఇంకా గొప్ప కళా కారులవుతారని.

ఇంకొందరు సామాన్యులుగా పుట్టి తరువాత శిక్షణ ద్వారా అసామాన్యులవుతా రని.

శ్రీ బాలమురళిలో ఈ రెండు దశలూ ఇమిడి ఉన్నందున ఆయన మహర్దశలో ప్రకాశిస్తున్నాడు.

కొందరు గాయకులు కచ్చేరీలలో తమ గానంలో మునిగి ఉండటం తప్ప సహకార వాద్యశిల్పులైన మార్దంగికులను, వైలిన్ వాదకులను అంతగా పట్టించుకోరు.

ఆయన ఆ విధంగా కాక తన సహకార వాదకులకు ఎంతో విలువ ఇస్తూ, వారిపట్ల ఎంతో శ్రద్ధాసక్తులు చూపుతాడు.

కొందరు ప్రసిద్ధ గాయకులు కళలోని శిల్ప మాధుర్యానికి ఎక్కువ శ్రద్ధను చూపక శాస్త్ర విద్యా మర్మాలకే చూపుతారు.

అటువంటప్పుడు కళ అనేది రస సృష్టికి బదులు వైదుష్యాన్నే ఎక్కువగా ప్రదర్శించటంలో సఫలమవుతుంది.

ఆయనలో వైదుష్యానికి కొదువ లేదు. అయినప్పటికీ, పాండితికి భంగం లేకుం డానే రస సరితను ప్రవహింప చేయటంలో ఆయన దక్షుడు.

తాను సంగీతంలో చేసిన నవ్యసృష్టుల్లో పల్లవిని పాడటంలో తాళగతుల విన్యా సంలో ప్రవేశపెట్టిన రీతి ఎంతో విలువైంది.

దాన్ని సామాన్యశ్రోతలు గ్రహించకపో వచ్చు. అది వేరే విషయం. తన ప్రదర్శ నల్లో ఎన్నో సాంకేతిక విషయాలను అప్పటి కప్పుడు సృష్టించి వినిపించగల నవ్యస్రష్ట ఆయన.

మిగతా వారివలె ఆయన తన కచేరీ సమయంలో అనవసర ఆవేశాలకు, ప్రకంప వలకు లోను గాక మానస భారసామ్యాన్ని కలిగి చిత్త వైకల్యానికి దూరంగా ఉంటాడు.

కళాసృష్టి అంటే కేవలం ఆవేశానికి లొంగిపోవటం కాదు. అందుకే ఆంగ్ల కవి వర్డ్స్‌వర్త్ అంటాడు, "Poetry is emotion recollected in tranquillity" అని.

ఆ సంయమమే మనకు ఆయన గాన ఘడియల్లో కనిపిస్తుంది. ఆ సంయమమే ఏ కళాకారుని జీవితంలోనైనా, కళా ప్రదర్శన లోనైనా సాఫల్యాన్ని చేకూర్చేది.

ప్రతి కళలోను సంప్రదాయం, స్వేచ్ఛ అనేవి ఉంటూనే ఉన్నాయి. అన్ని కాలా ల్లోను, అన్ని దేశాల్లోను అమల్లో ఉన్న సంప్రదాయం నుంచి ఉద్భవించిన స్వేచ్ఛ ఒక నాటికి సంప్రదాయంగా రూపొందు తుంది.

తిరిగి దానినుంచి విముక్తుడు కావటా నికి కళాకారుడు ప్రయత్నించి స్వేచ్ఛను పొంది నవ్యసృష్టి చేస్తాడు.

శ్రీ బాలమురళీకృష్ణ సంప్రదాయాన్ని నిర్లక్ష్యపరచకుండానే స్వేచ్ఛతో నిండిన నవ్య సృష్టిని చేస్తాడు తన నాదకళలో.

ఇటువంటి నవ్య సృష్టి సాధనలో ఒకో సారి శాస్త్రానికి విరుద్ధంగా కూడ వ్యవహరిం చాలని ఉంటుంది. శాస్త్రం పాండితికి సంబంధించింది. పాండితి నియమాలకు లోబడి ఉంటుంది. నియమాల ఆధిక్యత కళాకారునిలోని సృజన శీలతకు ఒకోసారి బంధన అవుతుంది.

అపుడు నిపుణ కళాకారుడు శాస్త్రాన్ని

లెక్క చేయక స్వచ్ఛంధ స్రష్టగా రూపొందు తాడు.

శాస్త్రం ముందు పుట్టి, తరువాత కళ పుట్టలేదు. కళ ముందు పుట్టియే, శాస్త్రం తరువాత పుట్టింది.

భాషకు ముందు పుట్టింది కాదు వ్యాక రణం; భాష పుట్టిన తరువాతనే వ్యాకరణం పుట్టింది. అందుకే కవి తన అవసరాన్ని బట్టి తన కవితా సృష్టిలో వ్యాకరణాన్ని ఉల్లంఘిస్తాడు.

వ్యాకరణం కవిత కాదు.

సంగీత శాస్త్రం సంగీతం కాదు.

ఈ రహస్యాన్ని తెలుసుకొని దాన్ని సర్వ విధాలా సంగీతంలో అమలు జరిపి నూతన గాన సౌరభాలను గుబాళింప చేసిన దిట్టల్లో దిట్ట శ్రీ బాలమురళి.

కళ అనుకరణలో పుడుతుంది. స్వతంత్ర సృజనలో పరిణతి చెందుతుంది.

జానపద కళలకున్న స్వేచ్ఛ శాస్త్రీయ కళల కుండదు. మొదటిది దేశ సంగీతం, రెండవది మార్గ సంగీతం అని వాడుకలో ఉన్నాయి.

శ్రీ బాలమురళి తన మార్గ గానంలో అవసరం అయినపుడల్లా దేశీ ఛాయలను సమ్మేళించటానికి వెనకాడదు. రసస్ఫూర్తి నిమిత్తం సంప్రదాయానికి తిలాంజలి నివ్వ టానికి ఆయన ఆనందంతో ముందుకు వస్తాడు.

అందుకని ఆయనలోని సంగీత శాస్త్ర జ్ఞానం పల్చబడిందా అంటే అదేమీ లేదు, దాని చిక్కదనం దానికే ఉన్నది.

కచేరీ కాని సమయాల్లో ఆయన నోట నుండి సంగీత శాస్త్రాన్ని గురించిన లోతు గల, ఎత్తుగల, నిడివైన, వెడల్పయిన వాక్కులు వింటుంటే వినేవారికి భ్రమ జనిస్తుంది. ఆయన శాస్త్రజ్ఞుడు తప్ప ఇంకేమీ కాదని.

అదే వ్యక్తిని మనం కచేరీ సమయంలో వింటూంటే అనిపిస్తుంది ఆయన మధు మయ గాన కోకిల తప్ప మరేమీ కాదని..

మొదటి దానిలో ఆయనది మేధ ప్రద ర్శన, రెండవ దానిలో హృదయ ప్రదర్శన. ఒకదాని కంటే మరొకటి తీసిపోదు.

శ్రీ బాలమురళి వేత్తా ద్రష్ట

ఆయన సురభిల రసస్రష్ట

కళా జగత్తులో ఆయన ఎంత పదునుగా ఉంటాడో వ్యవహార జగత్తులో కూడా అంతే. ప్రతి విషయంలో చిత్తశుద్ధినీ, పట్టు దలనూ ప్రత్యక్ష పరుస్తాడు.

చాలా ఏళ్లనాడు తెనాలిలో ఆయన పాట కచేరీని ఏర్పరచారు. ఆ తరుణంలో ఈ వ్యాసకర్త కూడా అక్కడ ఉండటం జరి గింది.

కార్యక్రమం ఇంకా ప్రారంభం కాలేదు. చూచే వాళ్లకు అనిపించసాగింది, ఆయన సుఖంగా కూర్చోజాలక పోతున్నట్లు.

కార్యక్రమం ఏర్పాటు చేసిన వారు ఆయన అవస్థను గ్రహించి ఆయన్ను అందుకు కారణం అడిగి తెలుసుకున్నారు. తొడమీద గడ్డ లేచి బాధిస్తున్నట్లు, అయిన ప్పటికీ కార్యక్రమాన్ని సాగించాలసిందే అని పట్టుపట్టాడు ఆయన. ఈ వ్యాసకర్త కూడ ఆనాటి కార్యక్రమాన్ని ఆపి విశ్రాంతి తీసు

కోమని ఆయన్ను బ్రతిమాలటం జరిగింది.

అయినా, ఎవరి మాటా వినిపించుకో కుండా ఆ బాధతోనే కూర్చొని కార్యక్ర మాన్ని ఏ లోపం లేకుండా బ్రహ్మాండంగా ముగించాడు చిరునవ్వులతోనే.

మేము కొందరం అనుకున్నాం, ఇదివ రలో విని ఉన్న ఆయన కచేరీల కంటే ఇది ఎక్కువ రక్తి కట్టిందని.

అవును మరి, శరీరబాధ మూలంగా మానసం పదునెక్కుతుంది, పదునెక్కిన మానసం నుంచి లయమయ స్పందన ఎక్కువ రసస్ఫూర్తిని అందుకుంటుంది.

ఆనాటి కచేరీలో ఆయనకు వైలిన్ తోను, మృదంగంతోను సహకరించిన సుప్రసిద్ధులు అన్నవరపు రామస్వామి గారు, కమలాకరరావు గారు అని జ్ఞాపకం.

శరీరబాధ మూలంగా మానసం పదునె క్కుతుంది అనే సత్యం అన్ని సందర్భా లకూ చెందదు. శరీరబాధ మితంగా ఉంటేనే కాని మానసం పదునెక్కదు, అమి తంగా ఉంటే మాత్రం అదివరకున్న పదును కూడా మొద్దుబారి పోతుంది.

ఆనాడు ఆయన చూపిన పట్టుదలకూ బాధా సహిష్ణుతకూ మేమంతా మెచ్చుకో కుండా ఉండలేక పోయాం.

సంగీతంలోని సాంకేతిక వివరాలు చాలా సున్నితమైనట్టివి. కారణం, మిగతా కళల న్నింటికంటే సంగీతం ఎక్కువ సూక్ష్మ మైన కళ, ఎక్కువ నైరూప్య కళ.

శ్రీ బాలమురళి నూతన రాగాలను సృష్టించాడు అన్నాం. వాటిలోని 'లతాంగి' అనే రాగం విశిష్టమైందని వాడుక.

శంకరాభరణం, కల్యాణి అనే రాగాల సమ్మిశ్రణమే 'లతాంగి' రాగపు సృష్టి అని.

శంకరాభరణం, కల్యాణి అనే రాగాల సమ్మిశ్రణమే 'లతాంగి' రాగపు సృష్టి అని.

అయితే ఈ సూక్ష్మ సత్యాన్ని తెలుసు కోటానికి కొంత ప్రత్యేక అభిజ్ఞత అవ సరం. శంకరాభరణం అంటే, ఏమిటో తెలిసి ఉండాలి. కళ్యాణి అంటే కూడా తెలిసి ఉండాలి.

రత్నపరీక్ష కష్టమైంది అంటారు. నిజమే కాని రాగ పరీక్ష అంతకంటే ఎక్కువ కష్టమైంది.

అయితే, ఈ విషయంలో ఒక విశదీక రణ అవసరం. రాగం అంటే శ్రవ్యం మాత్రమే కాదు, దృశ్యం కూడ. కల్యాణి రాగం అన్నట్లే సాంధ్యరాగం అని కూడా అంటాం. మొదటిది శ్రవ్యరాగం అయితే, రెండవది దృశ్యరాగం అని.

అసలు, పూర్వకాలంలో రాగం అనేది ప్రధానంగా దృశ్యమే. అంటే రంగును కూడ రాగం అనే వారు.

''రంజతి ఇతి రాగః'' అని ప్రాచీన శాస్త్రాల్లో ఉన్నది. ఏది రంగు వేస్తుందో అది రాగం అని. రంగు వేస్తుంది కనుక రంగును రంగు అంటే రాగం అని.

కాని రాగం అంటే శ్రవ్యరాగమనే సత్యం చాలా కాలంగా వ్యాప్తి చెంది ఉన్నది.

ఇక దీని అంతిమ తీర్మానం ఏమి అంటే రాగం అంటే చెవికి వినిపించేదీ కంటికి కనిపించేదీ అని కూడ.

ఇక్కడ మన రాగం చెవికి వినిపించేదే కాని కంటికి కనిపించేది కాదు.

పైన వ్రాస్తూ ఒకచోట అన్నాం, శ్రీ బాలమురళి తమిళంలో, తెలుగులో కూడ గేయ రచన చేశాడని. ఆ రెంటిలో మాత్ర మేకాక సంస్కృతంలో కూడ అటువంటి రచనలు చేశాడు ఆయన.

ఆయన హిందూస్తానీ సంగీతం కూడ పాడతాడు కనుక హిందీలో కూడ ఏదైనా గేయరచనలను చేశాడేమో తెలియదు.

చరిత్ర ప్రకారం అయితే దక్షిణ దేశపు కర్ణాటక సంగీతమనేదీ, ఉత్తర దేశపు హిందూస్తానీ సంగీత మనేదీ క్రీ.శ. పన్నెండో శతాబ్దానికంటే ముందువేనని. పన్నెండో శతాబ్దం నుంచే ఈ వర్గీకరణ వచ్చిందని.

ఆయన కర్ణాటక సంగీతం పాడినా, హిందుస్తానీ సంగీతం పాడినా దానిలో సాంకేతిక నైపుణ్యంతోపాటు జనరంజక సారళ్యం కూడ ఉంటుంది కనుక ఆయన కచేరీలు నిపుణ శ్రోతలకు నచ్చినట్లుగా సామాన్య శ్రోతలకు కూడ నచ్చుతాయి.

ఆయన్ను గురించి మరో మాట కూడ అనవచ్చు. శాస్త్రీయ సంగీతాన్ని ప్రజారం జకం చేశాడని.

అటువంటప్పుడు, ఇటువంటి మాట కూడ అనవచ్చునేమో తెలియదు. ఎటు వంటి మాటంటే జానపద సంగీతాన్ని శాస్త్రజ్ఞులకు రంజకం చేశాడా అని. చేయక పోయినా పరవాలేదు.

శ్రీ బాలమురళి గేయరచనల్లో తిల్లానా లది ప్రత్యేక స్థానం. శ్రోతల రస హృదయా లను ఆయన తిల్లానాలు ఇట్టే ఆకట్టుకొం టాయి.

మనుషుల మనస్తత్వాలను బాగా ఎరి గున్న శ్రీ బాలమురళి తన కచేరీ పూర్తి చేసే తరుణంలో తన తిల్లానాలను పాడ తాడు. దాని వలన శ్రోతల హృదయాకాశం వెన్నెలతో నిండిపోతుంది.

ఆయన తత్వాలు పాడుతూ వుంటే. వినే వారిలో గూడా ఆధ్యాత్మిక గాలులు వీస్తవి. వ్యవహార జగత్తునుంచి ఆయన ఎంత దూరం తొలిగి ఉండడో తెలియదు కాని సంగీత జగత్తు నుంచి మాత్రం ఆయన ఎంత దూరమూ తొలిగి ఉండడు. ఆయన వేరు, సంగీతం వేరు కాదు. శ్రీ బాలము రళి గాయకుడు మాత్రమే కాదు, స్వయంగా గానం కూడ ఆయనయే! ★

*Fame is dangerous.*
*People view you as somebody*
*you can't possibly live up to'*

# ఖద్దరు సంస్కృతి

-వి.ఆర్. నార్ల

ఇటీవల నాకు ఖద్దరు సంస్కృతిపట్ల జుగుప్స పుడుతున్నది. అందువల్ల ఖద్దరు ధారణ మరి విరమించవలెనన్న నిర్ణయానికి వచ్చాను.

పండగలకు, పబ్బాలకు కొత్త బట్టలు కట్టు కొనే ఆచారాన్ని నేను పాటించను. నా జన్మదినం నాడైనా కొత్త బట్టలు కొనను, కట్టుకోను. అయినా నాలుగు నెలల నాడు (డిసెంబర్ 1, 1980) నా 73వ జన్మదినం సందర్భంలో కొత్తబట్టలు కొని కట్టుకొన్నాను. నాడు నేను కొన్నవీ. కట్టుకొన్నవీ మిల్లు బట్టలు.

1925 ప్రాంతాలలో అని జ్ఞాపకం – జవహర్ లాల్ నెహ్రూ ఖద్దరును ''లివరీ ఆఫ్ ఫ్రీడమ్'' అని ప్రస్తుతించాడు. అందుకు గాంధీ ఎంతగానో మురిసి పోయాడు. అయితే ఈ నాడు ఖద్దరు ''లివరీ ఆఫ్ సర్విలిటీ''గా మారింది. ఈనాడు ఖద్దరు అనృతానికి, అక్రమానికి, అధర్మానికి ఆచ్ఛాదం. ఈనాడు ఖద్దరు కపటానికి, కుత్సితానికి, క్రౌర్యానికి కవచం. ఈనాడు ఖద్దరు నైచ్యానికి, స్వార్థానికి, ద్రోహానికి మేలిముసుగు.

ఇది ఒక్కసారి జరిగిన మార్పు కాదు. దాదాపు మూడు, నాలుగు దశాబ్దాలుగా ఇది కొనసాగుతున్నది. గాంధీ జీవితకాలంలోనే నిజానికి ఇది ప్రారంభమైంది. ఇందిరాగాంధీ పరిపాలనా కాలంలో ఇది తారా స్థాయికి చేరినట్టు చెప్పవచ్చు.

ఖద్దరు వస్త్రధారుల మాట విడిచి పుచ్చండి. ''కట్టేవి కాషాయ వస్త్రాలు, దూరేవి దొమ్మర గుడిసెలు'' అనే సామెతను జ్ఞాపకం చేయగల విధంగా వారు బాహాటంగానే ప్రవర్తిస్తున్నారు. పోతే, ఖద్దరు ఉద్యమ నాయకులలోనే చెదురుగా తప్ప నిజం లేదు, నీతి లేదు, నిలకడ లేదు. ఖద్దరు ఉత్పత్తి కేంద్రాలలో, విక్రయ కేంద్రాలలో ఎన్నెన్నో దగాకోరు పనులు జరుగుతున్నాయి: తేనెలో బెల్లం పాకం కలపడం, దంపుడు బియ్యంలో రాళ్ళూ రప్పలూ కలపడం వగైరాలు వగైరాలు తరచు జరుగుతున్నాయి. ఈ మధ్యనే ఒక కేంద్రమంత్రి ఖద్దరు డిపోనుంచి సీమ బాదం పప్పు కొనగా, దానిలో ఏవేవో పప్పులు కలసి వున్న వట.

ఇక ఖద్దరు టోపీని పెట్టుకునే వ్యక్తిని చూస్తే హడలిపోవలసి వస్తున్నది. వారిలో మూటికి 99 మంది ''టోపీదానులు'' వారు కాళ్ళకింద గోతిని తేలికగా తీయగలరు. కళ్లల్లో కారాన్ని దండిగా కొట్టగలరు. తిన్న యింటి వాసాలు తాపీగా లెక్క పెట్టగలరు. తడిగుడ్డతో గొంతు సునాయాసంగా కోయగలరు.

ఈనాటి మన నైతిక పతనానికి నిందించవలసింది ఒక్క ఖద్దరుధారులను మాత్రమే కాకపోవచ్చు; ఇతరులు వారికంటె తక్కువ నిందార్హులు కాకపోవచ్చు. కాని, ఒక్క విషయం మర్చిపోరాదు. ఈనాటి మన సంఘ నాయకులు, ప్రభుత్వనాయకులు ఖద్దరుధారులే. అందువల్ల ఈనాటి మన నైతికపతనావస్థకు ప్రధానంగా బాధ్యత వారిదే!

మట్టి నుంచి మహావీరులను గాంధీజీ సృష్టించినట్టు చెప్పడం కద్దు. అయితే వీరు తిరిగి మట్టిముద్దలుగా ఎన్నడో మారిపోయారు.

నేనిదివరలో ఒకసారి రాసినట్టు, గాంధీకి గోపాలకృష్ణ గోఖలే నైతికపు గురువు, గోఖ్లేకు మహదేవ గోవింద్ రణడే నైతికపు గురువు. ఒక జాతిగా మన నైతికపు పునరుజ్జీవనకే ఈ ముగ్గురూ అగ్రప్రాధాన్యమిచ్చారు. ఫలితం మాత్రం - మన పునరుజ్జీవనం కాదు, మన నైతిక పతనం మాత్రమే. ఈ ముగ్గురు నాయకుల జీవితాలు వ్యర్థ జీవితాలుగా పరిణమించినవని చెప్పక తప్పదు.

ఈ విషయంలో గాంధీని ప్రత్యేకించి తప్పు పట్టవలసి వుంటుంది. మానవ స్వభావంలో

బలాలతోపాటు దౌర్బల్యాలు కూడా వుంటాయి. ఈ దౌర్బల్యాలను దృష్టిలో పెట్టు కొనకుండా నైతిక ప్రమాణాలను నిర్ణయిస్తే, మన ప్రవర్తనలో, మన జీవితంలో కపటం విధిగా ప్రవేశిస్తుంది. ఉదాహరణకు గాంధీ కోరిన మేరకు ఎందరు సత్యాన్ని పాటించగలరు? ఎంత మంది అగ్రహాన్ని జయించగలరు? ఎంతమంది త్యాగాలు చేయగలరు? ఎంతమంది బ్రహ్మచర్య వ్రతాన్ని (పైగా, వాతిగల బ్రహ్మచర్యాన్ని) అనుసరించగలరు?

మరొక గాంధీకి తప్ప ఆచరణ సాధ్యం కాని అత్యున్నత నైతిక ప్రమాణాలను ప్రజాస్వామ్యం ముందు పెట్టినందువల్లనే మన జాతీయ జీవనంలో కపటం విశేషంగా–కాదు, విపరీతంగా - ప్రవేశించింది. చివరికి గాంధీ సయితం తన నైతిక ప్రమాణాలను అన్ని సందర్భాలలో పూర్తిగా పాటించగలిగినట్టు నాకు తోచదు.

ఒకవేళ ఈ విషయంలో అభిప్రాయభేదం ఉన్నా, ఒకటి మాత్రం నిశ్చయం. నేటి ఖద్దరు ధారులలో అత్యధిక సంఖ్యాకులు సంఘానికి వేరు పురుగులుగా పరిణమించారు. ఏదో ఒక పేరుతో, ఏదో ఒక విధంగా ప్రజలను దోచుకుతినడమే వీరికి ప్రధాన వ్యాపకమయింది. అన్నట్టు, వీరు ధరించే ఖద్దరు వస్త్రాల ధరలో ఎన్నదగ్గ భాగాన్ని ప్రజలు సబ్సిడీ రూపంలో భరించవలసి వస్తున్నది.

ఏమైనా, నీతి, నిజాయితీలపట్ల ఇప్పటికయినా కొంత గౌరవమున్నవారు ఖద్దరును ధరించడం వెంటనే మానివేయాలి. ఒకప్పుడు విదేశీ వస్త్ర దహనం ఒక ఉద్యమంగా సాగింది. యువకులెవరైనా ఖద్దరు వస్త్ర దహనానికి ఉద్యమం ప్రారంభిస్తే వారికి నా నైతిక ప్రోత్సాహం పూర్తిగా లభిస్తుంది.

నేను సూచిస్తున్న ఉద్యమం ద్వారా తప్ప ఇప్పటి ఖద్దరు సంస్కృతికి–స్వార్థం, కపటం, నైచ్యం మొదలైన దుష్టగుణాలన్నింటికి ప్రతీకగా నిలుస్తున్న ఖద్దరు సంస్కృతికి–అంత్యక్రియలు జరగవు.

(పునర్ముద్రణ)

---

# మూఢ నమ్మకాలు
# ఆవు - ఆయుర్వేదం

గోవధ నిషేధం మనదేశంలో వినోబా భావే నుండి ఎందరో ప్రచారం చేశారు. మతానికీ ఆవుకీ ముడిపెట్టారు. ప్రభుత్వాలు నిషేధ చట్టాలు చేశాయి. ప్రజల అవసరాలు, ఆహార అందుబాట్లు, ఆర్థిక సమస్యలు పట్టించు కోకుండా గోవధ నిషేధానికై ఆందోళనలు సాగాయి. చదువుకున్న వారి ఛాందస, భావాలకు ఇదొక మకుటాయమానమైన ఉదాహరణ.

మనదేశంలో గోవధ నిషేధం కావాలన్న వారే, ఆయుర్వేదం ప్రోత్సహించాలని కూడా అన్నారు. ఆయుర్వేదం ప్రకారం ఆవు మాంసం అనేక విధాల మంచిది. దీనిని శరీరం వెలుపలా, లోపలా కూడా వైద్యం నిమిత్తం ఉపయోగించాలి. ఆయుర్వేద మూలగ్రంథాలలో ఆవుమాంసం గురించి, ఆవు ఉపయోగం గురించి విస్తారంగా ప్రస్తావన వున్నది. గోవును వధించకుండా గోమాంసం రాదుకదా.

ఆయుర్వేదంపై గౌరవం నిజంగా వుంటే గోవధ నిషేధానికి పట్టు పట్టరాదు. శుష్కించి పోతున్న వారు గోమాంసం తీసుకోవాలని ఆయుర్వేదం చెబుతున్నది.

ఆయుర్వేదం ప్రాచీనకాలం నుండీ కార్యకారణ సంబంధాలను పాటించి వైద్యం పెంపొందించింది. అంటే కర్మ, పునర్జన్మ వంటి గుడ్డినమ్మకాలను ఆయుర్వేదం పాటించలేదు. వైద్యుడు తనపై, తన వైద్యంపై నిర్దిష్టమైన కార్యకారణ సంబంధం చూపితేగాని, చికిత్సకు పూనుకోలేడు గదా. దైవాధీనం అంటూ వైద్యం చేయడం హోమియో జీవశక్తి వంటి మూఢనమ్మకంలో కుదరవచ్చు నేమోగాని, ఆయుర్వేదానికి అలాంటి చాదస్తం లేదు. ఇందుకే కాబోలు ఆయుర్వేదాన్ని అనాదినుండీ మన మతస్తులు చిన్నచూపు చూస్తూవచ్చారు. అగ్రకులాల వారు ఆయుర్వేదాన్ని నీచ వృత్తిగానే పరిగణించారు. శవాల్ని కోసి చూడనిదే శరీరంలో భాగాలు తెలియవు. శవాల్ని ముట్టుకునే వారు అపవిత్రులు అనే ధోరణి మత తత్వవేత్తలు ప్రచారం చేశారు.

భారతీయ ఆధ్యాత్మిక తత్వానికి మూలస్తంభాలైన కర్మ, ధర్మం, పునర్జన్మ వంటి గుడ్డి నమ్మకాలు పట్టించు కోకుండానే ఆయుర్వేధం సాగింది. కనుక దీనికి తగిన ప్రోత్సాహం రాకుండా చేసారు.

వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత యిచ్చి, పెంపొందించిన ఖ్యాతి బుద్ధునిదే. బౌద్ధ సన్యాస ధర్మం (Monk) స్వీకరించేటప్పుడు మూడు లక్షణాలను పరిగణనలోకి తీసుకున్నారు. అందులో ముఖ్యం వైద్యం తెలిసి వుండటం. ఆ పద్ధతే క్రైస్తవ మతం గూడా ఆదరించి వృద్ధిలోకి వచ్చింది. అలాగే ఆయుర్వేద వైద్యుల దీనూ. మనిషికంటే ఆవుకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వడం వలననే గోవధ నిషేధం చట్టాలోకి వచ్చింది. ఉత్తరోత్తరా ఆయుర్వేదం బ్రతకడానికి కొన్ని సిద్ధాంతాలు, నమ్మకాలు ప్రవేశపెట్టినా, ఆయుర్వేద తొలిచరిత్ర అంతా కార్యకారణ సంబంధమే. దైవాన్ని, మూఢనమ్మకాల్ని పట్టించుకొని ఆయుర్వేదం క్షుణ్ణంగా ప్రకృతిలోని వస్తువుల ఉపయోగాన్ని పరిశీలించి గ్రంధస్థం చేసింది. ఉత్తరోత్తరా,* అలాంటి శాస్త్రీయ ధోరణి ఆగిపోవడమే ఆయుర్వేదం కుంటుపడడానికి కారణం. ప్రత్యక్ష ప్రమాణాన్ని ఆయుర్వేధం బాగా వాడుకున్నట్లు, చరకసంహిత, సుశ్రుత సంహితలు తెలుపుతున్నాయి. అలాగే శస్త్ర చికిత్స కూడా ఆనాడు పెంపొంది, ఆగిపోయింది.

ఆయుర్వేదం కుంటుపడడానికి అశాస్త్రీయ ధోరణి ప్రబలడమే కారణం. ఆధునిక శాస్త్రీయ ధోరణులు అన్వయిస్తే ఆయుర్వేదం మళ్ళీ వూపిరిపోసుకోవచ్చు. కాని ఒక మూఢ నమ్మకంగా ఆయుర్వేదాన్ని ఆరాధిస్తే అది అలాగే వుండిపోతుంది. మతానికీ, నమ్మకాలకూ వైద్యం చిక్కొదురు. ఈ మూల సూత్రాన్ని గ్రహించాలి.

(''చరక సంహిత''లో గోవుతో సహ 165 జంతువులు ఎలా వైద్యానికి పనికి వస్తాంమో వివరంగా వుంది. పై అంశాలు దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ Science and Society ★

— ఎన్. ఇన్నయ్య

BCi

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

REH105M291

BC



మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | REH105M291 |
| పుస్తకం పేరు | మిసిమి |
| తారీఖు | 02 December 2024 |
| ముందు అట్ట | Yes |
| వెనుక అట్ట | Yes |
| మొత్తం పేజీలు | 37 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | Ci BCi |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | D.V.Vandana |
| పేజీలు విడదీసినది | D.V.Vandana |
| స్కాన్ చేసినది | A.Swathi |
| పరీక్ష చేసినది | SANDHYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | Good |